

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి తాళం వేస్తున్న నీటి సరఫరా కాంట్రాక్టర్లు

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి తాళం

● తాగునీటి సరఫరా బిల్లులు ఇవ్వలేదని కాంట్రాక్టర్ల నిరసన

మదనపల్లె, మార్చి 16: వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు తాగునీటి సరఫరా ఇవ్వలేదంటూ నీటి ట్యాంకర్ల కాంట్రాక్టర్లు శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. స్థానిక గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ కార్యాలయానికి చేరుకున్న కాంట్రాక్టర్లు మూడేళ్లయినా బిల్లులు చెల్లించరా అంటూ అధికారులను నిలదీశారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, కురబలకోట, పెద్దమండ్యం మండలాల్లో అప్పటి కరువులో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినట్లు బాధితులు తెలిపారు. 2019 డిసెంబరు నుంచి 2020 మే వరకూ ఆరు మండలాలకు సంబంధించి రూ.3.63 కోట్లు బిల్లులు బకాయి ఉన్నట్లు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి డీజల్ కొనుగోలు చేసి ట్యాంకర్లను నడిపామని, బిల్లులు చెల్లించాలని పలుమార్లు అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులను సంప్రదించినా ప్రయోజనం లేదని ములకలచెరువు మండలానికి సంబంధించిన కాంట్రాక్టర్లు వాపోయారు. ఈ క్రమంలో ఈఈ కార్యాలయం ప్రధాన ద్వారాన్ని మూసేసి తాళం వేసి కొంతసేపు నిరసన తెలిపారు. అనంతరం అక్కడకు చేరుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీహరి కాంట్రాక్టర్లతో మాట్లాడారు. విడతల వారీగా నీటి బిల్లు ఇప్పటికే 1.78 కోట్లు చెల్లించామని మిగిలిన బిల్లు ప్రభుత్వంలో పెండింగ్ ఉందన్నారు. ఈ క్రమంలో ఆరునెలల క్రితమే సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశామని, ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే బ్యాంకు ఖాతాలకు జమ అవుతుందన్నారు. బకాయిల అంశాన్ని మరోసారి అటు ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నగారా.. మోగింది..

● ఏప్రిల్ 18న నోటిఫికేషన్ జారీ
● నామినేషన్లకు చివరి తేదీ ఏప్రిల్ 25
● మే 13న ఎన్నికలు
● అమల్లోకి వచ్చిన ఎన్నికల నియమావళి
● అధికార పార్టీ ఆగడాలకు చెక్ పడ్డట్టే?
● కానుకల పంపిణీ ఆగేనా?




(రాయచోటి-ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఎన్నికల నగారా మోగింది. దీంతో పాటు రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలకు కూడా ప్రకటన వెలువడింది. రాష్ట్రంలో ఎన్నికలు మే 13న జరుగుతాయని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. జిల్లాలో రాజంపేట పార్లమెంటు పరిధిలోని తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలు ఉన్నాయి. రాజంపేట నియోజకవర్గంలో పురుషులు 1,15,590 మంది, మహిళలు 1,21,421, 10 మంది ఇతరులు కలిపి 2,37,021 మంది ఓటర్లు ఉన్నారు. రైల్వేకోడూరులో పురుషులు 99,351 మంది, 1,02,176 మంది మహిళలు, 17 మంది ఇతరులు కలిపి 2,01,544 మంది ఓటర్లు ఉన్నారు. రాయచోటిలో పురుషులు 1,23,836 మంది, మహిళలు 1,26,512 మంది 26 మంది ఇతరులు కలిపి 2,50,374 ఉన్నారు. తంబళ్లపల్లెలో 1,09,217 మంది పురుషులు,, 1,12,418 మంది మహిళలు, 10 మంది ఇతరులు కలిపి 2,21,645 మంది ఓటర్లు ఉన్నారు. పీలేరులో 1,14,019 మంది పురుషులు, 1,18,397 మంది మహిళలు, 16 మంది ఇతరులు కలిపి 2,32,432 మంది ఓటర్లు ఉన్నారు. మదనపల్లెలో 1,27,399 మంది పురుషులు, 1,32,399 మంది మహిళలు, 57 మంది ఇతరులు కలిపి 2,59,780 మంది ఓటర్లు ఉన్నాయి. జిల్లా మొత్తంగా మహిళలు, పురుషులు, ఇతరులు కలిపి 14,02,796 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో సుమారు 1600కు పైగా పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ ఆధ్వర్యంలో అన్ని చర్యలు తీసుకున్నారు. అవసరమైన మేర ఎన్నికల అధికారులను నియమించారు. వాళ్లందరికీ ఎన్నికల విధులకు సంబంధించి.. శిక్షణ కూడా పూర్తి చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న సీఎం, మంత్రుల ఫొటోలను తొలగించనున్నారు. అలాగే రోడ్లపై ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడగనున్నారు.

అధికార పార్టీ ఆగడాలకు చెక్

కోడ్ అమలులోకి రావడంతో ప్రతిపక్షాలకు పెద్ద ఉపశమనం దొరికినట్టే. కోడ్ అమలులోకి రావడంతో ఇక అధికార పార్టీ ఆగడాలకు చెక్‌పడ్డట్టేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని ప్రతిపక్షాలు నిత్యం ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వం చేపట్టే.. ప్రజావ్యతిరేక విధానాలపై కనీసం గొంతెత్తే సాహసం కూడా చేయలేని పరిస్థితులు. పోలీసులు మరీ ఏకపక్షంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజల్లో రాష్ట్ర ప్రభుత్వంపైన తీవ్ర వ్యతిరేకత ఉంది. దీంతో అధికార పార్టీ ఓటమి భయంతో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నాలు చేసింది. ఓటర్లకు చీరల పంపిణీ చేసింది. ఎన్నికల కోడ్ రాక ముందే.. జిల్లాలోని ఓటర్లందరికీ చీరలు పంపిణీ చేయాలని అధికార పార్టీ నిర్ణయించుకుంది. దీంతో పీలేరు, రైల్వేకోడూరు, రాజంపేట, తంబళ్లపల్లె నియోజకవర్గాలలో చీరల పంపిణీ జరుగుతోంది. అయితే అధికారులు ఎవరూ అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికల కోడ్ రావడం.. అధికార పార్టీ ఆగడాలకు చెక్‌పడగా.. ప్రతిపక్షాలకు మాత్రం పెద్ద ఊరటగానే చెప్పవచ్చు. ఈ పరిస్థితుల్లో ఇకనైనా అధికారులు ఎన్నికల కోడ్‌ను నిక్కచ్చిగా అమలు చేయాలని పలు రాజకీయ పార్టీలు కోరుతున్నాయి.

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేది	ఏప్రిల్ 18
నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ	ఏప్రిల్ 25
నామినేషన్ల పరిశీలన	ఏప్రిల్ 26
నామినేషన్ల ఉపసంహారణకు చివరి తేదీ	ఏప్రిల్ 29
పోలింగ్ తేదీ	మే 13
కౌంటింగ్	జూన్ 4



యువత ఓటుతోనే ప్రజాస్వామ్యం బలోపేతం

● జేసీ ఫర్మాన్ అహ్మద్

కలికిరి, మార్చి 16: యువత తమ ఓటు హక్కును వినియోగించుకుంటేనే దేశంలో ప్రజాస్వామ్యం పటిష్టంగా బలోపేతమవుతుందని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ హితోపదేశం చేశారు. కొత్తగా నమోదైన యువ ఓటర్లను ఓటుహక్కు వినియోగించుకునే దిశగా చైతన్య పరిచేందుకు ఉద్దేశించిన సదస్సు స్థానిక జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జరిగింది. పరిపాలనలో అభివృద్ధికి ఈ విధంగా తమ వంతుగా తోడ్పాటు అందించాలన్నారు. చురుకైన యువత నిర్ణయాలు కొత్త భవిష్యత్తుకు దారి చూపించగలవని కూడా వివరించారు. యువత తమ కుటుంబ సభ్యులందరితో కలిసి ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. యువత నిర్లిప్తంగా ఉంటే తదుపరి ఏర్పడే ప్రభుత్వాలపై దాని ప్రభావం ఉంటుందని హెచ్చరించారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి యువత పోటీ పడాలని సూచించారు. ఓటర్ల చైతన్యవంతం కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి రాజశేఖర్‌రెడ్డి, నెహ్రూ యువకేంద్రం అధికారి మణికంఠ ఓటు ప్రాధాన్యత గురించి వివరించారు. ఓటింగ్ శాతాన్ని పెంచడం కోసం అవసరమైతే పురుషులు, మహిళలు, వయోవృద్ధులు-దివ్యాంగులకు వేరువేరుగా మూడు క్యూలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అదే విధంగా ఓటింగ్ సమయాన్ని కూడా పెంచుతామన్నారు. అనంతరం ప్రలోభాలకు లొంగకుండా, ఏవిధంగానూ ప్రభావితం కాకుండా మరే ఇతరత్రా వాటికి లొంగకుండా నిర్భయంగా ఓటేస్తామని ప్రమాణం చేయించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ అపర్ణ, పీలేరు ఈఆర్వో రమ, కలికిరి తహసీల్దారు విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

పీలేరు రిటర్నింగ్ అధికారిగా జేసీ

రాబోయే సార్వత్రిక ఎన్నికల కోసం పీలేరు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల అధికారిగా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు. శనివారం కలికిరి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో నూతన ఓటర్ల కోసం నిర్వహించిన చైతన్య సదస్సులో ఆయన మాట్లాడుతూ పీలేరు రిటర్నింగ్ అధికారిగా తాను వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశం అనంతరం కళాశాలలో మాక్ పార్లమెంటు, మాక్ పోలింగ్ నిర్వహించారు. చివరగా ఆయన ఓటింగ్ కంపార్ట్‌మెంట్ లోపలికి వెళ్లి బటన్ నొక్కి ఓటు వేశారు.



ఓటు హక్కు వినియోగంపై ప్రమాణం చేయిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.. ఓటేయండి..

● ప్రజలకు కలెక్టర్, ఎస్పీ పిలుపు ● ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి

రాయచోటి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంత వాతావరణలో ఓట్లు వేయడానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్, ఎస్పీ కృష్ణారావు జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రకటన వెలువడిన నేపథ్యంలో శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఇద్దరు కలిసి సంయుక్తంగా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొన్న ప్రకారం జిల్లా ప్రజలందరూ రాబోయే ఎన్నికలను పండుగ వాతావరణంలో జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈసారి జిల్లాలో సగటున 80 శాతం పోలింగ్ తగ్గకుండా చూడాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎటువంటి ఆరోపణలకు అవకాశం లేకుండా పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 18న మన రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేందుకు అధికారులకు.. ప్రజల సహకారం కూడా అవసరమన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా ఒక పార్టీకి అనుకూలమనే ఆరోపణలు లేకుండా ఎన్నికల సంఘం ఆదేశాలను అమలు చేయాలన్నారు. ఎన్నికల నియమావళిని పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కుల, మత, ప్రాంతీయపరమైన విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఎవరూ ప్రవర్తించకూడదన్నారు. రాజకీయ పార్టీలు ర్యాలీలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలన్నారు. అధికారులు తక్షణమే ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రితో సహా మంత్రుల ఫొటోలు తొలిగించాలన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలను కప్పి ఉంచాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కిందకు వచ్చే ఏ అంశాన్నీ నిర్లక్ష్యంగా తీసుకోకూడదని అధికారులను ఆదేశించారు. ఓటర్లను ప్రలోభపెట్టే ఎటువంటి చర్యలు చేపట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కలెక్టరేట్లో ఒక కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి నియోకవర్గంలోనూ.. కంట్రోల్ రూంను ఏర్పాటు చేయనున్నటు తెలిపారు. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ.. వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీ, జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో 266 రూట్లు ఏర్పాటు చేసి.. 18 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 'సివిజిల్ యాప్‌ను ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. 80 సంవత్సరాలు దాటిన వృద్ధులు, 40 శాతం పైగా వికలత్వం ఉన్న వాళ్లు తమ ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. అయితే వీళ్లు కూడా సాధ్యమైనంత వరకు పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకుంటే ఎందరికో స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే సమస్యలు ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, ఎన్నికల్లో ఎటువంటి గొడవలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల వారీగా సమాచారం ఉందని, అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో సత్యనారాయణ, పలువురు అధికారులు పాల్గొన్నారు. .



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు వైసీపీ అభ్యర్థుల ప్రకటన

● అన్ని స్థానాలను ఒకేసారి ప్రకటించిన అధిష్టానం



రాయచోటి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల సమరానికి వైసీపీ తన టీంను రెడీ చేసింది. కడప జిల్లా ఇడుపులపాయలో శనివారం ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో రాష్ట్రమంత్రి ఆదిమూలపు సురేశ్ అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. రాజంపేట పార్లమెంట్ స్థానాన్ని సిట్టింగ్ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేరు ప్రకటించారు. కాగా అసెంబ్లీ అభ్యర్థులకు సంబంధించి రాయచోటి స్థానానికి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాజంపేటకు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి రైల్వేకోడూరుకు కొరముట్ల శ్రీనివాసులు, పీలేరుకు చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లెకు నిస్సార్ అహ్మద్, తంబళ్లపల్లెకు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్లను ప్రకటించారు. కాగా సిట్టింగ్‌లలో నలుగురికి టిక్కెట్లు దక్కగా రాజంపేట, మదనపల్లెలో మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు దక్కలేదు.

జిల్లాలో అన్ని స్థానాల అభ్యర్థులను వైసీపీ అధిష్టానం ఖరారు చేసింది.

నమో నారసింహ.. నమో భక్తపాల

● వైభవంగా నరసింహస్వామి ధ్వజారోహణం
● కుడి ప్రసాదాల కోసం ఎగబడ్డ మహిళలు
● హంస వాహనంపై స్వామివారు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

గుర్రంకొండ, మార్చి 16: మండలంలోని తరిగొండ శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో స్వామివారి ధ్వజారోహణాన్ని టీటీడీ వేద పండితులు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయాన్నే స్వామివారిని మేల్కొలిపి ఆలయశుద్ధి, తోమాలసేవ, అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనాన్ని అర్చకులు చేశారు. స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ మీనలగ్నంలో గరుడ చిత్రపటాన్ని ధ్వజస్తంభంపైకి అధిరోహింపజేసి పది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా జరగాలంటూ పూజలు చేశారు. అనంతరం డోళి ఉత్సవాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా చేశారు. సాయంత్రం స్వామి వారికి ఊంజల్ సేవ నిర్వహించి సర్వాంగ సుందరంగా అలంకరించిన స్వామి వారు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామి వారు గ్రామ పురవీధుల్లో హంస వాహనంపై విహరించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఏఈవో గోపినాథ్, వెంకటస్వామి, కృష్ణమూర్తి, టీటీడీ అర్చకులు, గోపాల్‌భట్టార్, కృష్ణరాజ్, కృష్ణప్రసాద్, అనిల్, గోకుల్, నరసింహ, బాలాజి, వెంకీ, వరద, సిబ్బంది నాగరాజ, మురళి తదితరులు పాల్గొన్నారు.

కుడి ప్రసాదాల కోసం ఎగబడ్డ మహిళలు

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం రోజున కుడి ప్రసాదాలను (సంతాన ప్రసాదం) మహిళలకు పంపిణీ చేస్తారు. ఈ ప్రసాదాలను సంతానం లేని దంపతులు తింటే వారికి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో కుడి ప్రసాదాల కోసం మహిళలు ఎగబడ్డారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ముత్యపు పందిరి వాహనం, స్నపన తిరుమంజనం కార్యక్రమం జరుగుతుంది. రాత్రికి హనుమంత వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.



ధ్వజారోహణం చేస్తున్న వేద పండితులు

ఒత్తిడి వీడితేనే పదిలం



పీలేరు అయ్యప్పరెడ్డి కాలనీలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలను సందర్శించిన ఎంఈవోలు

● రేపటి నుంచి
పదో తరగతి పరీక్షలు
● జిల్లాలో టెన్త్
విద్యార్థులు
25,522 మంది
● 129
పరీక్షా కేంద్రాలు



పీలేరు, మార్చి 16: పదో తరగతి పబ్లిక్ పరీక్షలంటే అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రుల్లో ఒక రకమైన తెలియని టెన్షన్ నెలకొంటుంది. ఒత్తిడి వీడి ధైర్యంగా పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పబ్లిక్ పరీక్షలనగానే టెన్త్ విద్యార్థులందరూ తీవ్రమైన ఒత్తిడిలో ఉంటారు. ఆ ఒత్తిడి కారణంగా పబ్లిక్ పరీక్షలు దగ్గరపడే కొద్దీ కొంతమంది విద్యార్థులు హైరానా పడిపోతుంటారు. ఆ హైరానా కారణంగా ఏడాది పొడవునా కష్టపడి చదివినదంతా మరిచిపోవడం, పరీక్షల ముందు అనారోగ్యం పాలైపోవడం చేస్తుంటారు. తమ పాఠశాలల్లో జరిగే పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించే విద్యార్థులు కూడా పలుమార్లు ఒత్తిడి కారణంగా పబ్లిక్ పరీక్షల్లో చతికిలపడుతుంటారు. ఒత్తిడికి లోనవకుండా మానసిక ప్రశాంతతతో పరీక్షలు రాయాలని పీలేరు ఎంఈవో లోకేశ్వర్ రెడ్డి చెబుతున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్షా కేంద్రాలకు 100 మీటర్లలోపు జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఎంఈవో-2 పద్మావతమ్మతో కలిసి స్థానిక అయ్యప్పరెడ్డి కాలనీలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు.

జిల్లాలో 25,522 మంది టెన్త్ విద్యార్థులు

ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న 492 పాఠశాలలకు చెందిన 25,522 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు డీఈవో శివప్రకాశ్ రెడ్డి తెలిపారు. వారిలో 13,003 మంది బాలురు, 12,519 మంది బాలికలు ఉన్నారని, వారి కోసం జిల్లా వ్యాప్తంగా 129 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయని, విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.45 గంటలకే చేరుకోవాలన్నారు. పది పరీక్షలు రాసే విద్యార్థులు తమ ఒరిజినల్ హాల్‌టిక్కెట్లు చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని ఆయన వెల్లడించారు.

పిల్లలు ఒత్తిడికి గురి కాకుండా తల్లిదండ్రులు చూసుకోవాలి..

పది పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో పిల్లలు ఒత్తిడికి గురి కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. పరీక్షలు జరిగినంత కాలం తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలి. ఇంతకాలం చదివించిన ఉపాధ్యాయులు సైతం పిల్లలకు పరీక్షలు రాయాల్సిన సులువైన పద్ధతులను వివరించాలి. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉంటే తప్పనిసరిగా మంచి మార్కులు సాధిస్తారు.

- లోకేశ్వర్‌రెడ్డి, పీలేరు ఎంఈవో-1

విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు పూర్తి

గాలివీడు, మార్చి16: బ్రాహ్మణవీధిలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవాదాయశాఖ ఈవో కొండారెడ్డి తెలిపారు. శనివారం గాలివీడులో పర్యటించిన ఆయన పెద్దూరు బ్రాహ్మణవీధి శ్రీవారి ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. మార్చి 18, 19, 20వ తేదీల్లో జరగబోవు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠకు విచ్చేయు భక్తులకు సౌకర్యాలు, పార్కింగ్, అన్నప్రసాదాల వితరణ ఏర్పాట్లపై సమీక్షించారు. 20వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి పట్టణంలో జరగబోవు ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు హరి కృష్ణయ్య, వీరారెడ్డి, మణికుమార్, రమేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా హరిత

ఓబులవారిపల్లె, మార్చి 16: మండలంలోని చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా డి.హరిత బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పనిచేసిన దస్తగిరి, ఉపాధ్యాయ బృందం నూతన ప్రిన్సిపాల్‌కి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో ముక్కా వరలక్ష్మి, గ్రామస్తులు

ఓబులవారిపల్లె, మార్చి 16: మండలంలోని కడియాల పల్లెలో పార్వతీ పరమేశ్వరుల నూతన శివాలయ నిర్మాణానికి రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కావరలక్ష్మీ, వారి కుమారుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో వేమన సతీష్, శ్రీనివాసులునాయుడు, అబ్బూరి నాగయ్య నాయుడు, అబ్బూరి రామకృష్ణ, కోనూరు శ్రీకాంత్, గంగవరం శ్రీను, దాసరి రాజయ్య, దాసరి లోకేష్, మద్దిపాటి శంకరయ్య, సత్యంరాజు, సింగమాల రఘునాథ్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, పులపత్తూరు విష్ణువర్ధన్‌రెడ్డి, నారపరెడ్డి రాజారెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, పుత్తూరు శ్యాంసుందర్ రెడ్డి, రమణ రాజు, పోలసాని కిరణ్‌కుమార్, సుబ్రమణ్యం, రజనీకాంత్‌రెడ్డి, పెంచలయ్య, వెంకటరమణారెడ్డి, కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామికి పూజలు

సుండుపల్లె, మార్చి 16: ముడుంపాడు గ్రామ పంచాయతీ ఆరోగ్యపురంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పూజలు, అభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు అమ్మనాయక్ తెలిపారు. మొక్కుబడులు ఉన్న భక్తులు స్వామి వారికి తలనీలాలను సమర్పించారు. అనంతరం ఆలయ సమీపంలోని ఆంజనేయస్వామికి పూజలు చేశారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

రాయచోటి మున్సిపల్ కమిషనర్‌గా వాసుబాబు



బాధ్యతలు స్వీకరిస్తున్న వాసుబాబు

రాయచోటిటౌన్, మార్చి 16: రాయచోటి మున్సిపాలిటీ కమిషనర్‌గా శనివారం ఎన్.వాసుబాబు బాధ్యతలు స్వీకరించారు. గత నెల 1న రాయచోటి మున్సిపల్ కమిషనర్‌గా విధుల్లో చేరిన శ్రీనివాసరావు అనారోగ్యం కారణంగా సెలవులో వెళ్లడంతో ఆయన స్థానంలో ప్రభుత్వం డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న వాసుబాబును బదిలీ చేసింది. మున్సిపల్ అధికారులు, సిబ్బంది మల్లికార్జున, కొండయ్య, మాసుమ్‌బాషా, భక్తుడు, సుబ్బరాయుడు తదితరులు సాదరంగా స్వాగతం పలికి పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆశీర్వదిస్తే.. అభివృద్ధి బాధ్యత నాదే: మండిపల్లి



మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి హారతి పడుతున్న ముస్లిం మహిళలు

చిన్నమండెం, మార్చి 16: ఒక్కసారి ఆశీర్వదించండి... రాయచోటి అభివృద్ధి బాధ్యత తీసుకుంటానని రాయచోటి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని మల్లూరు గ్రామ పంచాయతీలో శనివారం ఆయన పర్యటించారు. రాయచోటి నుంచి భారీ ర్యాలీతో చేరుకున్న ఆయనకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా వైసీపీ నాయకులు దోచుకోవడం, దాడులు చేయడం మినహా, ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వీధి దీపాలకు కనీసం మరమ్మతులు చేయించలేక వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే ఈ రాక్షస పాలన సాగనంపి టీడీపీ కూటమికి ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే, రాజంపేట ఎంపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని మహమ్మద్‌పురా వీధిలో శ్రీనివాసులరెడ్డి (కోడి శీను) ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో కొత్తపల్లికి చెందిన మైనార్టీ కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో భూ దందాలు, ఇసుక మాఫియా తప్ప అభివృద్ధి లేదన్నారు. మనకు రామరాజ్యం కావాలి అంటే మహిళలకు రక్షణ కావాలంటే యువతకు ఉద్యోగాలు కావాలంటే రైతులకు రక్షణ కావాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలి. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. అధికారంలో ఉన్నది ఒక తీవ్రవాది అని, ఎన్నికల రోజు వరకు మీ శక్తికి మించి పని చేసి రాయచోటి అసెంబ్లీ స్థానాన్ని, రాజంపేట పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు సల్లావుద్దీన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లయన్ చెన్నూరు అన్వర్‌బాషా, ప్రముఖ పారిశ్రామికవేత్త మడితాటి శ్రీనివాసులరెడ్డి, జాఫర్‌అలీ, మాజీ కౌన్సిలర్లు అతావుల్లా, మైనుద్దీన్, ఖాదర్‌బాషా, షేక్. సయ్యద్, భాను, ఇంతియాజ్, గని, అహ్మద్, రషీద్, షంషీర్, షాకీర్, షరీఫ్, యూనిస్‌ఖాన్, సయ్యద్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 247 కేసులకు శాశ్వత పరిష్కారం



లక్కిరెడ్డిపల్లె సివిల్ కోర్టులో లోక్‌అదాలత్‌కార్యక్రమంలో జడ్జీ ఫైజున్నీసా



రైల్వే కోడూరు: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సివిల్ జడ్జి అంజనీ ప్రియదర్శిని

లక్కిరెడ్డిపల్లె మార్చి 16: వేర్వేరు పట్టణాల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 247 కేసులకు పరిష్కారం లభించినట్లు న్యాయమూర్తులు తెలిపారు. లక్కిరెడ్డిపల్లె సివిల్ కోర్టులో లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, రామాపురం మండలాలకు సంబంధించి 27 కేసులు పరిష్కారం కాగా, 32,97,023 రూపాయలు వసూలు అయినట్లు లక్కిరెడ్డిపల్లె కోర్టు సివిల్ జడ్జి షేక్ ఫైజున్నీసా తెలిపారు. న్యాయవాదులు ఎంఎల్ రామచంద్రారెడ్డి, బాలాజీరెడ్డి, చెన్నకృష్ణయ్య, రెడ్డెయ్య, సిద్దయ్య, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నందలూరు: స్థానిక సివిల్ కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 73 కేసులకు శాశ్వత పరిష్కారం లభించినట్లు జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కె.లత తెలిపారు. సివిల్ కేసుల్లో 6లక్షల రూపాయలు, క్రిమినల్ కేసులు 35,69,600 రూపాయలు ఫిర్యాదుదారులకు అందజేసినట్లు తెలిపారు. రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు సంబంధించి మొత్తం 72 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఇందులో సివిల్ 17,38,000 రూపాయలు, క్రిమినల్ 2,86,500 రూపాయలు ఫిర్యాదుదారులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో నందలూరు, రాజంపేట ఏపీపీలు ఉమారాణి, రెహానా రసూల్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దాసరి నరసింహులు, న్యాయవాదులు మహమ్మద్ అలీ, ఆనంద్ కుమార్, ఏజీపీ షమీఉల్లాఖాన్, కోర్టు కానిస్టేబుల్, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు(రూరల్): రైల్వేకోడూరులో 75 క్రిమినల్, సివిల్, బ్యాంకు కేసులను పరిష్కరించినట్లు రైల్వేకోడూరు జూనియర్ సివిల్ జడ్జి అంజనీ ప్రియదర్శిని తెలిపారు. 18,30,614 లక్షల రూపాయిలు లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. బార్ ప్రెసిడెంట్ అద్దెపల్లె వెంకట రామరాజు, సీనియర్ న్యాయవాదులు కోడూరు సీఐ టి.బాబు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె కాలపు హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న అంగన్వాడీ యూనియన్ ప్రధాన కార్యదర్శి లలితమ్మ

రాయచోటిటౌన్, మార్చి 16: అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, కనీస వేతనం అమలు, వేతనం పెంపుతోపాటు, సమ్మె కాలపు హామీలు అమలు చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోషియేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. లలితమ్మ డిమాండ్ చేశారు. శనివారం రాయచోటి పట్టణంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సరోజమ్మ అధ్యతన అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవోలు ఇవ్వడం కాదని, హామీలను వెంటనే అమలు చేయకపోతే, ఎన్నికల తరువాత మలిదశ ఉద్యమం ప్రారంభిస్తామని హెచ్చరించారు. సమ్మె కాలపు జీతాలు, మార్చి వరకు సంపూర్ణ పోషణ బిల్లులు, సెంటర్ల అద్దెలు, ఈవెంట్ బిల్లులు, కరెంటు బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ్‌నాయక్, ఏఐటీయూసీ రాయచోటి పట్టణ కార్యదర్శి పుల్లయ్య, సుజాత, జయలక్ష్మి, సుజాత, అనురాధ, తులసి, దుర్గా, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవోలు, చీఫ్

గాలివీడు, మార్చి 16: ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని మండల విద్యాశాఖ అధికారి పిల్లి నాగరాజు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షల ఇన్విజిలేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలుర ఉన్నత పాఠశాలలో 180 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 240 మంది, ఉర్దూ పాఠశాలలో 180 మంది మొత్తం 600 మంది విద్యార్థులు మండల వ్యాప్తంగా పరీక్షలకు హాజరు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 వీ. శ్రీనివాసులు, బాలుర, బాలికల, ఉర్దూ పాఠశాల చీఫ్ సూపరింటెండెంట్లు సుబ్బరాయుడు, దుర్గేశ్వరరాజు, రాధా కృష్ణ నాయక్, డిపార్టుమెంట్ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం: మండలంలో 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి శంకరయ్య సూచించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు విద్యుత్, ఫ్యాన్లు ఏర్పాటుచేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులు పరికరాలను అనుమతించకూడదన్నారు. ఉదయం 9.30కి ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. సిద్దవటం హైస్కూల్‌లోని రెండు కేంద్రాల్లో 255 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారన్నారు. చీఫ్ డిపార్టుమెంట్ ఆఫీసర్లు మల్లికార్జునరావు, సుబ్బ య్య, డిపార్టుమెంట్ ఆఫీసర్ నరసింహులు, కాజా హుస్సేన్ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under instructions from my client M/s Shriram Finance Limited, RAYACHOTY Branch. I issue the following notice. My client company intends to grant a loan facility to **Sri Boragula Syed Shabber** S/o **B. Syed Jaffar, 2. Boragula Shakirunnisa W/o B. Syed Shabeer,** D.No.1/1, Kaspa, Malluru Village, Post, Chinnamandem Mandal, Annamayya District under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large, banks, financial institutions or any individual money lenders are hereby informed that if any objections regarding the said loan, the public shall inform in writing within seven days from the date of this notice for the below mentioned schedule property, otherwise it shall be deemed that there are no objection from anybody and any objections received after seven days will not binding upon my client's company for the below schedule property. **SCHEDULE:-** Annamayya District, erstwhile Y.S.R. Kadapa District, Rayachoty Sub.Reg. Dist. Rayachoty Mandal & Village Polam in Sy. No. 770/1 an extent Ac. 60 Square yards house bearing D.No. 41/114 at Bose Nagar Street, **Bounded by:** East– House of Mahaboob Basha D.No. 41/115, West - House of Shaik Vadla Khadar Basha, North - Sandhu Rasta, South - 12 feets width Rasta. **Measuring:** East - West = 12 feets North - South = 45 R.C.C. Building with ground floor, first floor with doors, doorframes, windows, Almaras and all fittings attached to the building with easementary right. (Property covered under registered sale deed No. 6702/2023)

C. SUNIL KUMAR REDDY, B.A., B.L., ADVOCATE, Rayachoty, 9441738746

ఎన్నికల కోడ్ ముందు హడావుడి

● నాలుగేళ్లుగా పట్టించుకోని నేతలు ● అధికారులకు టీడీపీ నేతల ఫిర్యాదు



పైపులైన్ పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

సంబేపల్లె, మార్చి16: మండలంలోని దుద్యాల గ్రామంలో శనివారం ఎన్నికల కోడ్ విడుదలైన తర్వాత వైసీపీ నాయకులు తాగునీటి పథకాల పనులు చేస్తుండడంతో అధికారులకు ఫిర్యాదు చేసినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఎన్నికల కోడ్ ముందు హడావుడి చేపట్టడం ప్రజలను మభ్య పెట్టడమేనన్నారు. నాలుగేళ్లుగా పనులు చేయని వీరు ప్రస్తుత పనులు చేయడం ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమే అన్నారు. దుద్యాల గ్రామంలో నాలుగేళ్ల క్రితం మోపురంపల్లె ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించేందుకు మహమ్మద్‌నగర్ శ్మశానవాటిక వద్ద బోరు వేసి పైపులైన్ పనులు చేయకుండా వదిలేశారు. ప్రస్తుతం ఎన్నికలు వస్తుండడంతో పనులు ప్రారంభించడం బాగా లేదన్నారు. ఈ విషయం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

హ్యూమన్ రైట్స్ ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌చార్జిగా వెంకట్రమణ

సంబేపల్లె, మార్చి 16: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ రాయలసీమ జోన్ ఎస్సీ,ఎస్టీ సెల్ ఇన్‌చార్జిగా గుట్టపల్లె, గుదియవాండ్లపల్లెకు చెందిన వెంకట్రమణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం చేస్తానన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెనగలూరు, మార్చి16 : మండల పరిధిలోని పెనగలూరు, బెస్తపల్లె, కొండూరు, తిమ్మయ్యగారిపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని పెనగలూరు మండల విద్యుత్ ఏఈ సయ్యద్ షఫీ తెలిపారు. సబ్‌స్టేషన్ల పరిధిలో మెయింటెనెన్స్ కార్యక్రమాల కోసం ఆరుగంటలు విద్యుత్ కోత విధిస్తున్నట్లు తెలిపారు.

బహిరంగ సభకు తరలి రండి

సిద్దవటం, మార్చి 16 : తెలుగుదేశం బీజేపీ, జనసేన పార్టీల భారీ బహిరంగ సభకు 17వ తేదీన తెలుగుదేశం కార్యకర్తలు అందరూ పెద్దఎత్తున తరలిరావాలని టీడీపీ యువ నాయకుడు దారపునేని రాజేష్ నాయుడు పిలుపునిచ్చారు. 17వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు చిలకలూరిపేట నియోజకవర్గ బొప్పూడిలో నిర్వహించే ఈ కార్యక్రమానికి భారత ప్రధాని నరేంద్రమోదీ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ హాజరవుతున్నారని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు మండలంలోని ప్రజలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు.

కోడ్ కూసింది.. ముసుగు పడింది



పుల్లంపేట: ఫ్లెక్సీ తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

రైల్వేకోడూరు(రూరల్) మార్చి 16: ఎన్నికల నగారా మోగడంతో పట్టణంలోని నాయకుల విగ్రహాలకు అధికారులు ముసుగులు తొడిగారు. పట్టణంలో ఉన్న అన్ని పార్టీల ఫ్లెక్సీలను తొలగించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. నాయకులు ఎన్నికల నియమాలను పాటించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని ఎన్నికల అధికారి లీలారాణి హెచ్చరించారు. ఎన్ని కల కోడ్ అమల్లోకి వచ్చిందని అధికారులు విధులను సక్రమంగా నిర్వర్తించాలని కోరారు.

పుల్లంపేట: ఎన్నికల కోడ్ శనివారం నుంచి అమలులోకి రావ డంతో పుల్లంపేట మెయిన్ రోడ్డు, బైపాసు రోడ్డులో ఉన్న వివిధ పార్టీల రెవెన్యూ, పంచాయతీ అధికారి తొలగించారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డలకు ఆరోగ్యం



పోషణ్ పఖ్వాడాలో అంగన్‌వాడీ కార్యకర్తలు

పెనగలూరు, మార్చి16 : పౌష్టికాహారం తోనే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని సాతుపల్లి హరిజనవాడ అంగన్‌వాడీ కార్యకర్త పద్మ అన్నారు. శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పఖ్వాడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇండ్లూరు-2 అంగన్‌వాడీ కార్యకర్త ఉమ, సాతుపల్లె కార్యకర్త శారద, వసంత, సహాయకురాలు డి.పద్మతో పాటు బాలింతలు తల్లులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి

సిద్దవటం, మార్చి 16 : పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా సిద్దవటం మండలం భాకరాపేటలోని 11వ పోలీసు బెటాలియన్‌లో శనివారం కమాండెంటు పి.రవిశంకర్ నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధనకు అమరజీవియైన మహాపురుషుడు, మహాత్మాగాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కు జీవితాంతం కృషి చేసిన మహనీయుడు మన పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంటు డి. నాగేశ్వరప్ప, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

షాజహాన్ బాషాను కలిసిన టీడీపీ నేతలు



షాజహాన్‌బాషాను గజమాలతో సత్కరిస్తున్న మండల టీడీపీ నాయకులు

చిన్నమండెం, మార్చి 16: మండల తెలుగు యువత అధ్యక్షుడు తోహిద్‌ఖాన్, జిల్లా తెలుగు యువత నేతలు రాంప్రసాద్ నాయుడు, బాలచంద్రయాదవ్ ఆధ్వర్యంలో మదనపల్లె టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషాను శుక్రవారం రాత్రి కలిశారు. తెలుగుదేశం పార్టీ మదనపల్లె అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మదనపల్లె లో టీడీపీ కార్యాలయం వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల సందడి చూస్తుంటే భారీ అధిక్యంతో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని అనిపిస్తుందన్నారు.

ఎన్నికల కోడ్‌ను అందరూ పాటించాలి

నందలూరు, మార్చి16: ఎన్నికల కోడ్‌ను అందరూ తప్పక పాటించాలని తహసీల్దారు మహబూబ్‌బాషా, ఇన్‌చార్జి ఎంపీడీవో సతీష్‌కుమార్, ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ తెలియజేశారు. శనివారం ఎంపీడీవో సభా భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో మోడల్ కోడ్ ఆఫ్ కాంట్రాక్ట్ (ఎంసీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన రాష్ట్రంలో త్వరలో రానున్న ఎన్నికల కోడ్ సమయంలో ఏ గ్రామంలో వ్యక్తులను ప్రేరేపించే విధంగా ఉన్న రాజకీయ పార్టీల యొక్క పోస్టర్లను తొలగించాలని, నేతల విగ్రహాలకు ముసుగులు వేయాలని, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆర్ఐ సుశీల్ కుమార్ పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



సేవలపై ఆరాతీస్తున్న డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్

రాయచోటిటౌన్, మార్చి16: పట్టణ ఆరోగ్య కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి (డీపీఎంవో) డాక్టర్ రియాజ్‌బేగ్ సూచించారు. శనివారం ఆయన డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి కొత్తపల్లె పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ సంఖ్య పెంచాలని, ఆశ కార్య కర్తల ద్వారా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందించు సేవలపై ప్రతి ఇంటికి సమాచారం అందించాలని కోరారు. రోగులకు వడదెబ్బపై అవగాహన కల్పించాలని, ఓఆర్ఎస్ కార్నర్ ఏర్పాటు చేయాలని, ఆశ కార్యకర్తలు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అల్తాఫ్, పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఖగోళ విషయాలపై ఆసక్తిని పెంచడమే లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజేశ్వరి

సంబేపల్లె, మార్చి16: ఖగోళ విషయాలపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలలో ఖగోళ ప్రయోగశాలలను ప్రారంభించామని అన్నమయ్య జిల్లా డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజేశ్వరి తెలిపారు. సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఖగోళ ప్రయోగశాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖగోళ వింతలను తెలుసుకోవడానికి, అధ్యయనం చేసేందుకు ఈ ప్రయోగశాల ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఐసీఐ సీఐ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లాలో మొత్తం ఆరు పాఠశాలల్లో ఖగోళ ప్రయోగశాలలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంపై శిక్షణ ఇవ్వడానికి ఢిల్లీ నుంచి ప్రతినిధులు హాజరయ్యాన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి, కమిటీ చైర్మెన్ బుజ్జిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును సత్కరించిన న్యాయవాదులు



చంద్రబాబునాయుడును సత్కరిస్తున్న టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

రాజంపేట, మార్చి 16: అధికారం లోకి వచ్చిన వెంటనే న్యాయవా దుల సమస్యలను పరిష్కరిస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. శుక్రవారం విజయవాడ ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన న్యాయవాదుల సదస్సులో రాజంపేట న్యాయవాదుల తరపున టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడుకు శాలువా కప్పి సత్కరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయవాదులకు రూ. 7 వేలు వేతనం, డెత్ బెనిఫిట్స్ కింద రూ. 7లక్షలు, బార్ కౌన్సిల్‌కు 100 కోట్లు నిధులు కేటాయించాలని, న్యాయవాదులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

విద్యతో పాటు సమాజ సేవపై అవగాహన అవసరం

సుండుపల్లె, మార్చి 16: క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు సమాజ సేవపై విద్యార్థులకు అవగాహన అవసరమని మానవతా సంస్థ సుండుపల్లె మండల కమిటీ కార్యదర్శి రెడ్డెప్ప నాయుడు, కమిటీ ప్రతినిధి చెంగల్‌రాయుడు సూచించారు. మానవతా సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఏడు తెలుగు, రెండు ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో శనివారం నైతిక విలువలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురిని ఎంపిక చేసి నగదు బహుమతులతో పాటు మెరిట్ సర్టిఫికెట్, మెమెంటోలను పంపిణీ చేశారు. గుంతరాచపల్లె ఉన్నత పాఠశాలలో కార్యదర్శి రెడ్డెప్పనాయుడు, ప్రతినిధి చెంగల్‌రాయుడు, ప్రధానోపాధ్యాయుడు జయచంద్ర, ఉపాధ్యాయ బృందంతో కలిసి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. .

ఏఐటీయూసీ గుర్తింపు కార్డుల పంపిణీ



ఏఐటీయూసీ గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

రాజంపేట టౌన్, మార్చి16 : స్థానిక పాత బస్టాండులోని ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులకు శనివారం ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.రాయుడు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటో వర్కర్లు మద్యానికి దూరంగా ఉండి, యూనిఫాం ధరించి విధులు నిర్వహించాలన్నారు. ఆటోలను తక్కువ స్పీడుతో నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సికిందర్, దస్తగిరి, సురేష్, రమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలతో సీఐ బాబు

రైల్వేకోడూరు(రూరల్) మార్చి 16: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలని రైల్వే కోడూరు సీఐ టి.బాబు కోరారు. శనివారం మండలంలోని బుడుగుంటపల్లెలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. గతంలో జరిగిన పోలింగ్ సరళిపై స్థానికులతో చర్చించారు. ఎన్నికల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంత ఓటింగ్‌కు సహకరించాలని కోరారు. అనంతరం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.3.4 కోట్లతో 'చేయూత'

నందలూరు, మార్చి 16: మండలంలోని 45 నుంచి 60 ఏళ్లలోపు 1619 మంది మహిళల ఖాతాల్లో చేయూత పథకం కింద 3.04 కోట్ల రూపాయలను జమ చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో ఏపీఎం వసుంధర ఆధ్వర్యంలో జగనన్న చేయూత కార్యక్రమాన్ని నిర్వహించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు

● ఉపాధి పనుల కల్పనపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్ అభిషిక్త్ కిశోర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 16: వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి వివరించారు. శనివారం విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, డీఆర్‌వో సత్యనారాయణరావు హాజరయ్యారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు పర్చాలన్నారు. ప్రభుత్వ పథకాల్లో ఇప్పటికే ఆమోదం పొంది ప్రారంభించి ఇంకా పూర్తి కాని పనులను పూర్తి చేయాలన్నారు. కొత్త పనులను చేపట్టరాదన్నారు. వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి రాకుండా తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు వెళ్లాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలో ఉపాధి పనులను విరివిగా చేపట్టాలని జల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులకు సూచించారు. ముఖ్యంగా కరువు మండలాల్లో ప్రత్యేక దృష్టి సారించి ఇప్పటికే ఆమోదం పొందిన సెల్ఫ్ ఆఫ్ గ్రూప్ పనులను ముమ్మరం చేయాలన్నారు. హౌసింగ్‌లో 90 రోజుల పనులు పూర్తయిన వాటికి బిల్లుల చెల్లింపులు వేగవంతం చేయాలన్నారు. ఎన్నికల మోడల్ కోడ్ దృష్టిలో ఉంచుకొని ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా జిల్లాలో ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించాలని, వైద్య శిబిరాల్లో గుర్తించిన రెఫరల్ రోగులను ఆసుపత్రులకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. నీటి కలుషితం వలన డయేరియా ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకోవాలని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జనన, మరణాలను పకడ్బందీగా నమోదు చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైవీయూ ఆర్ట్స్ బ్లాక్‌లో వీసీ ఆకస్మిక తనిఖీ

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 16 : యోగివేమన విశ్వవిద్యాలయం ఆర్ట్స్ బ్లాక్ వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది హాజరు రిజిస్టర్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. సెలవులో ఉన్న వారి అనుమతి పత్రాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు తక్కువగా ఉన్న వారిని పరీక్షకు అనుమతించవద్దని సూచించారు. అకడమిక్ విషయాలపై చర్చించి సూచనలు చేశారు. స్కాలర్ల పరిశోధనలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు.

రామాపురం మండల వాసికి

గేట్‌లో ఆల్‌ఇండియా 65వ ర్యాంకు


గురు మహేశ్

రామాపురం, మార్చి 16: ఇటీవల జరిగిన గేట్ పరీక్షలో మండలంలోని కుమ్మరిపల్లె పంచాయతీ మన్నేరువాండ్ల పల్లికి చెందిన పసుపులేటి అనురాధ, శివశంకర్ దంపతుల కుమారుడు గురుమహేశ్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఆల్ ఇండియా స్థాయిలో 65వ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు వ్యవసాయదారులు కాగా, ఈ విద్యార్థి హైస్కూలు స్థాయి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో, ట్రిపుల్ ఐటీలో బీటెక్ చదివాడు. ఆల్ ఇండియా 65 ర్యాంకు రావడంతో గ్రామంలోని ప్రజలు, కుటుంబ సభ్యులు అభినందించారు.

ఒత్తిడి జయిస్తే.. ఉత్తమ ఫలితాలు

● విద్యార్థులకు ఉపాధ్యాయుల సూచన ● రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు

భౌతికశాస్త్రంలో కొత్త విషయాల జోలికి వెళ్లకూడదు..



విద్యార్థులు ఉన్న సమయంలో కొత్త విసయాల జోలికి వెళ్లకూడదు. ఎస్ఏ1, ఎస్ఏ2 యాక్షన్‌ప్లాన్ పేపర్స్ ఫాలో అయితే సులభంగా ఫిజికల్ సైన్స్ పేపరులో కనీసం 30 మార్కులకు పైన తెచ్చుకోవచ్చు. రసాయన శాస్త్రంలోని పరమాణు నిర్మాణం, లోహ సంగ్రహణం శాస్త్రం, ఆమ్లం, క్షారాలు (యాసిడ్) పాఠ్యాంశాల నుంచి చిత్రపటాలు, రివిజన్ చేసుకుంటే తప్పక ఉత్తీర్ణత లభిస్తుంది. భౌతిక శాస్త్రంలోని కటకటాలు, దృష్టిదోషాలు, సంబంధించిన ప్రయోగాలు రివిజన్ చేసుకోవాలి. ఉష్ణం పాఠ్యాంశం నుంచి రివిజన్ చేసుకోవాలి. ఈ రెండురోజుల్లో కొత్త ప్రశ్నలు, మోడల్ పేపర్లు తదతర వాటిపై దృష్టి పెట్టకపోవడమే మంచిది. గతంలో విద్యార్థులు చదవిన, రాసిన జవాబులు రివిజన్ చేసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చు.


- రమణయ్య, స్కూలు అసిస్టెంటు

తెలుగు ఉత్తీర్ణత కావడానికి..



1, 3, 7, 8, 10 పాఠాల్లో కవి పరిచయంపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలి. 2, 4, 6, 9, 11 పాఠ్యాంశాల్లో పూర్తిస్థాయిలో అవగాహన కలిగిన ప్రక్రియ నేపథ్యంలో పై ప్రశ్నలకు జవాబు రాయడం సులభమవుతుంది. వ్యాకరణంలో అలంకారం, ఛందస్సు, అర్థాలు, పర్యాయ పదాలు, నానార్థాలు, ఉత్పత్తి అర్థాలపై పూర్తి అవగాన పెంచుకోవాలి, 1, 2, 4 ప్రశ్నలకు వచ్చే పేరాలను బాగా చదివి జవాబు రాయాలి.

- చెంగల్‌రెడ్డి, స్కూలు అసిస్టెంటు, తెలుగు



కడప (ఎడ్యుకేషన్), మార్చి 16: పదోతరగతి పరీక్షలు దగ్గరపడ్డాయి. మరో రెండురోజులు మాత్రమే ఉండడంతో విద్యార్థులకే కాదు.. వారి తల్లిదండ్రులకు పరీక్ష కాలం ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 581 పాఠశాలల్లో 27,858 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. పదో తరగతి పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 153 కేంద్రాలు సిద్ధం చేశారు. పరీక్షలు దగ్గరపడే కొద్దీ విద్యార్థులు వత్తిడికి గురై మానసికంగా కృంగిపోకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని ఉపాధ్యాయులు, వైద్యులు సూచిస్తున్నారు. ప్రధానంగా నిద్రలేమి, మానసిక వత్తిడి, భయం, మతిమరుపు నుంచి విద్యార్థులు బయట పడేందుకు పలువురు నిపుణులు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

ధీమాతో ముందడుగు

నేర్చుకున్న పాఠ్యాంశాల్లోని ప్రశ్నలకు సమాధానాలు రాయగలనన్న విశ్వాసం ఉండాలి. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తామన్న ధీమా విజయాన్ని అందిస్తుంది. మానసిక వత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉంటూ నేర్చుకున్న పాఠ్యాంశాలను పునఃశ్చరణ చేస్తుండాలి. పరీక్షలకు ఏ ప్రశ్నలు వస్తాయో, ఏం చదవాలో, ముఖ్యమైన ప్రశ్నలు ఏవో అన్న గందరగోళానికి గురి కాకూడదు. ఇలా ఆలోచిస్తే నేర్చుకున్న విషయాలు మరిచిపోయే ప్రమాదం ఉంటుంది. తల్లిదండ్రులు ఇతరులతో పోల్చి తక్కువ చేసి మాట్లాడడం, ఎప్పుడూ చదవమని చెప్పడం వల్ల మానసిక సంఘర్షణకు గురయ్యే అవకాశం ఉంటుంది. పరీక్షల సమయంలో అతిగా తినడం, ఎప్పుడు పడితే అప్పుడు నిద్రపోవడం చేయకూడదు.

ఎండ ప్రభావానికి లోను కాకూడదు..

విద్యార్థులు ఎండ ప్రభావానికి లోనుకాకుండా ఎప్పటికప్పుడు చల్లని పానీయాలను సేవిస్తుండాలి. తగిన మోతాదులో గ్లూకోజ్ కలిపిన నీళ్లను పరీక్ష కేంద్రాల్లోకి తీసుకెళ్లాలి. ఎటువంటి వత్తిడికి లోను కాకుండా ప్రశాపత్రాలు బాగా చదివి కేటాయించిన సమయంలోపు జవాబు రాయగలగాలి మెదడుకు కనీసం ఆరు గంటలు విశ్రాంతి ఇచ్చే విధంగా అభ్యసనాన్ని కొనసాగించాలి. తెల్లవారుజామునే నిద్రలేచి కష్టమైన విషయాలను అభ్యసించాలి. పరీక్ష అనంతరం కొబ్బరి నీళ్ల అందుబాటులో ఉంటే లేదంటే చల్లని పానీయాలు స్వీకరించాలి. పరీక్ష ఫలితాలపై ఎటువంటి భయాందోళనకు గురికావద్దు.

- డాక్టర్ ఎన్.నాగార్జున, పిల్లల వైద్యుడు, ప్రొద్దుటూరు



గణిత ఉత్తీర్ణతకు సులభ సూత్రాలు..



గణితంలో సులభంగా ఉత్తీర్ణత కావడానికి ఈ సూచనలు పాటించాలి. 8 మార్కుల ప్రశ్నలు వాస్తవ సంఖ్యలు, బహుపదులు, వర్గ సమీకరణలు, నిరూపక యామితి, సంభావ్యత పాఠాలలో అభ్యసనం చేయాలి. 2, 4 మార్కుల ప్రశ్నలు వాస్తవ సంఖ్యలు, సమితులు, బహుపదులు, శ్రేణులు నిరూపక సమితి, సంఖ్య శాస్త్రం పాఠాలు అభ్యసించాలి, ఒకమారు ప్రశ్నలు 2, 4, 8 మార్కులకు సూచించిన పాఠాల నుంచి అభ్యసనం చేయాలి. వచ్చిన వాటికి జ వాబులు రాయాలి. స్వరూప త్రిభుజాలు, పాఠాలకు చెందిన నిర్మాణాలు గీయడంలో తర్ఫీదు పొందాలి, బహుపదుల్లో గ్రాఫ్‌లు తీయడంపై పట్టు పెంచుకోవాలి. 2023 పబ్లిక్ ప్రీఫైనల్, 2024ప్రీ ఫైనల్, ఎస్ఏ-1 మోడల్ ప్రశ్నాపత్రాలు పరిశీలించుకుంటే మంచిది. తక్కువ సమయం ఉన్నందున అన్ని పాఠాల మీద సింపుల్ టచప్ చేసి వదిలేయాలి.

- సీవీ ప్రసాద్, స్కూలు అసిస్టెంటు

గత ప్రశ్న పత్రాలు జాగ్రత్తగా పరిశీలించాలి



విద్యార్థులు సాంఘిక శాస్త్రంలో నూటికి నూరు మార్కులు సాధించడం కోసం గత ప్రశ్నాపత్రాలు జాగ్రత్తగా పరిశీలించి ప్రశ్నల సరళి అర్థం చేసుకోవాలి. రెండు మార్కులు, నాలుగు మార్కులు, 8 మార్కుల ప్రశ్నలను సూటిగా పాయింట్ల రూపంలో చక్కని దస్తూరితో రాయాలి. మ్యాప్ పాయింట్ల పట్ల శ్రద్ధ వహించి ఇండియా, వరల్డ్ మ్యాప్‌లను బాగా ప్రాక్టీసు చేయాలి. పరీక్షకు ప్రిపేరు అయ్యేటప్పుడు ప్రశ్నలకు సమాధానాల్లో ముఖ్యమైన అంశాలు నోట్ చేసుకోడం వల్ల అన్ని ప్రశ్నలు సులభంగా నేర్చుకోవచ్చు. అలాగే గుర్తు పెట్టుకోవచ్చు.

- సి.మహబూబ్‌షరీఫ్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు, రాజుపాలెం

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

● చైర్మన్ వార్డులోనే నీరు రాకపోతే ఎలా ● పోలీసులతో వాగ్వాదం

మైదుకూరు, మార్చి 16 : అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయ లోపంతో మైదుకూరు పట్టణ ప్రజలు నీటి కోసం అవస్థలు పడుతూ రోడ్డెక్కి, ఆందోళనలు చేస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ వార్డు కేసీ నగర్ 2వ వీధిలో 10 రోజులుగా కుళాయిలకు నీళ్ళు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఓట్లేసి గెలిపించినా ఆయన ఇటువైపు కన్నెత్తి చూడలేదంటూ శనివారం ఖాళీ బిందెలతో మహిళలు రోడ్డెక్కి ఆందోళన చేశారు. కడప రోడ్డు ప్రధాన రహదారి కావడంతో కాసేపు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ పాండురంగారెడ్డి సిబ్బందితో కలసి అక్కడికి చేరుకొని రోడ్డుపై ట్రాఫిక్ ఆపి ఆందోళన చేయవద్దన్నారు. ఏమైనా ఉంటే మున్సిపల్ ఆఫీసు వద్దకు వెళ్లి అధికారులకు తెలపాలన్నారు. కానీ మేము వెళ్ళం అధికారులు గానీ, లేక మేము ఓట్లేసిన మున్సిపల్ చైర్మన్ గాని రావాలంటూ పట్టుపడుతూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న స్థానిక వైసీపీ నాయకుడు ఒకరు నీళ్ళ ట్యాంకర్‌ను ఆ వీధిలోకి తెప్పించడంతో గొడవ ఆగిపోయింది.


రోడ్డుపై ఆందోళన చేస్తున్న మహిళలు

రోడ్డెక్కితే గాని నీళ్ళు పంపరా అయినా ట్యాంకర్ కాదు కుళాయిలకు నీళ్ళు వచ్చేలా చేయ్యాలి అంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మైదుకూరులోని 9,10,15,16,17,20, వార్డులలో అప్పుడే తాగునీటి కష్టాలు మొదలయ్యాయి.

● **500 లీటర్లు రూ.400తో కొనుగోలు..:** 9 ఏళ్ళ తరువాత మళ్లీ నీళ్ళు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ శివారులోని ఎర్రచెరువులో తెలుగుగంగ నుంచి నీటిని విడుదల చేసేలా దాదాపు 10 ఏళ్ళ క్రితం టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ శాశ్వత జీవో తీసుకొచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు నీటి సమస్య లేదు. అయితే అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంతో ఎర్రచెరువుకు నీళ్ల నింపలేదు. దీంతో భూగర్భజలాలు నిండుకొని మైదుకూరు పట్టణంలో తాగునీటి ఎద్దడి తీవ్రమైంది. పట్టణంలో మళ్లీ ఇన్నేళ్లకు 500 లీటర్లు రూ.400కు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని పట్టణ వాసులు ఆవేదన చేందుతున్నారు.


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మహిళలు

అగ్నికి ఆహుతైన అరటి పంట


అరటి తోట వద్ద బాధిత రైతు శ్రీనునాయక్

వేంపల్లె, మార్చి 16: మండలంలోని బక్కన్నగారిపల్లెలో అరటి పంట దగ్ధమైన సంఘటన శనివారం జరిగింది. బాధిత రైతు బుక్కే శ్రీనునాయక్ తెలిపిన వివరాలు మేరకు... ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దాదాపు రెండు ఎకరాల్లోని అరటి పంట దగ్ధమైందన్నారు. నిప్పంటుకున్న విషయాన్ని ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేయగా వారు వచ్చి మంటలను ఆర్పివేశారన్నారు. ఈ ప్రమాదం కారణంగా రూ.7లక్షలు నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



వీరబల్లి, మార్చి 16: గుడికి రంగులు వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మండల పరిధిలోని గుర్రప్పగారిపల్లె పంచాయతీ బెజవాడ హరిజనవాడకు చెందిన గండుపల్లి సుధాకర్ (45) శనివారం ఉదయం గంగమ్మ గుడికి రంగులు వేస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని 108 వాహనంలో రాయచోటి ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మార్గమధ్యంలోనే మరణించినట్లు నిర్ధారించారు. సుధాకర్‌రెడ్డికి భార్య, కూతురు ఉన్నట్లు బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీధి వ్యాపారులకు వైసీపీ తాయిలాలు

● వైసీపీ రంగుల గొడుగులు వితరణ

ప్రొద్దుటూరు , మార్చి 16 :వైసీపీ ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడంలో రకరకాల ఎత్తులు వేస్తున్నారు. ఏవిధంగానైనా తాయిలాలు అందించి ఓట్లు రాబట్టుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ప్రొద్దుటూరులో వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఎంపీ అవినాష్ రెడ్డి ముఖ్యమంత్రి జగన్ బొమ్మలతో ముద్రించిన గొడుగులను వీధి వ్యాపారులకు గత రెండు రోజులు అందజేస్తున్నారు. ముఖ్యంగా వేసవి ఎండల సందర్భంగా వారికి నీడనిచ్చే పేరిట ఈ తాయిలాలు అందజేస్తున్నారు. చాలా చోట్ల రోడ్లమీద తోపుడు బండ్లలో పండ్లు అమ్ముకునే వారికి టెంకాయల విక్రయాల వద్ద సైకిల్ షాపుల వద్ద చెప్పులు కుట్టే వారివద్ద ఇలా అనేక చోట్ల ఈ గొడుగులు పంచిపెట్టారు. అయితే శనివారం ఎన్నికల కోడ్ రావడంతో ఎన్నికల అధికారులు వీటిని తొలగిస్తారా లేదా వేచి చూడాలి .



వీధి వ్యాపారులకు వైసీపీ నాయకులు పంపిణీ చేసిన గొడుగులు

ప్రకృతి కోపం.. ప్రభుత్వానికి లేదు కనికరం

● గత ఏడాది డిసెంబరులో తుఫానుతో నష్టపోయిన పంట రైతులు ● బటన్ నొక్కినా అందని పరిహారం

చిట్వేలి, మార్చి 16: పెరిగిన పెట్టుబడి వ్యయం, గిట్టుబాటు కాని ధరలు, అనుకూలించని వాతావరణంతో అన్నదాత నలిగిపోతున్నాడు. జూదంలా మారిన వ్యవసాయంలో రైతు నష్టపోతూనే ఉన్నాడు. ఏటా నష్టాలను చవిచూస్తున్నా పుడమి తల్లిని నమ్ముకుని కష్టాన్ని పెట్టుబడిగా చేసుకుని వ్యవసాయం సాగిస్తున్నప్పటికీ రైతుల నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. సంక్షోభంలో కూరుకుపోతున్న వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలన్న ధ్యాసే పాలకులకు లేదని రైతులు వాపోతున్నారు. గత ఏడాది డిసెంబరు మిచౌంగ్ తుఫాను తాకిడికి మండలంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తుఫాను ప్రభావంతో మండలంలో 11 మంది రైతులకు చెందిన 3.5 హెక్టార్లలో నిమ్మ పంటకు నష్టం వాటిల్లగా, 679 మంది రైతులకు చెందిన 294.75 హెక్టార్లలో అరటి పంట, 29 మంది రైతులకు చెందిన 14.1 14.1 హెక్టార్లలో బొప్పాయి పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు.

పంట నష్టపరిహారం త్వరగా ఇవ్వాలి



ఐదు ఎకరాలలో అరటి పంట సాగు చేశాను. రెండు లక్షల పైచిలుకు వరకు ఖర్చులు వచ్చాయి. అకాల వర్షాల వల్ల చాలా వరకు పంటలు నష్టపోయాం. అధికారులు వచ్చి పంట నష్టం వివరాలను నమోదు చేసి రైతులపై చిత్తశుద్ధి ఉంటే నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలి.

- నాసింశెట్టి ఈశ్వరయ్య, కొత్తపల్లి గ్రామం

మూడు నెలలు దాటినా అందని పరిహారం

గత ఏడాది డిసెంబరు 5, 6 తేదీల్లో తుఫాను తాకిడికి రైతులకు అపార పంట నష్టం వాటిల్లింది. నష్టపోయిన పంటలను సంబంధిత అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపించినప్పటికీ ఇంతవరకు మండలంలో రైతుల ఖాతాలో పైసా కూడా జమ కాకపోవడం రైతులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. తుఫాను వల్ల దెబ్బతిన్న రైతుల నష్టపరిహారానికి చెందిన డబ్బులను ఈనెల 6వ తేదీ సీఎం జగన్ బటన్ నొక్కినా ఇంతరకు రైతులకు అది అందలేదు. ఇది ఉత్తుత్తి నొక్కుడే అని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు వేసిన పంట నష్టం వివరాలిలా ఉన్నాయి. నిమ్మ 3.5 హెక్టార్లకు గానూ రూ.78,750, అరటి 294.75 హెక్టార్లకు గాను రూ.73,68,750, బొప్పాయి 14.1 హెక్టర్లకు గానూ రూ.2,39,700 అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించారు. కానీ ఇప్పటి వరకు ఏ ఒక రైతుకు పంట నష్టం సహాయం అందించకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం వెంటనే రైతులకు పంట నష్టం పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

నాగవరంలో పడిపోయిన పంటను పరిశీలిస్తున్నఉద్యాన శాఖాధికారులు (ఫైల్)



లోక్ అదాలత్ కక్షిదారులకు వరం


కక్షిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న డీజే భీమారావు

చిత్తూరు లీగల్, మార్చి 16: కక్షిదారులకు లోక్ అదాలత్ కార్యక్రమం ఓ వరం వంటిదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు అన్నారు. శనివారం ఎస్టేట్‌లో ఉన్న జిల్లా కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు విభేదాలను పక్కనపెట్టి సోదరభావంతో మెలగాలన్నారు. డీఎల్ఎస్ఏ సెక్రటరీ కరుణకుమార్, సీనియర్ న్యాయవాది అశోక్ ఆనంద్ యాదవ్‌తో పాటు పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

1074 కేసుల పరిష్కారం

శనివారం ఉమ్మడి జిల్లాలో జరిగిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా 1,074 కేసులు పరిష్కారమయ్యాయి. వాయల్పాడులో 24, తిరుపతిలో 267, తంబళ్లపల్లెలో 4, శ్రీకాళహస్తిలో 62, సత్యవేడులో 52, పుత్తూరులో 103, పుంగనూరులో 62, పీలేరులో 38, పలమనేరులో 51, పాకాలలో 27, నగరిలో 33, మదనపల్లెలో 49, కుప్పంలో 67, చిత్తూరులో 235 కేసులు పరిష్కారమయ్యాయి.

ఎన్నికల నియమావళిపై అవగాహన ఉండాలి


ఈవీఎంలపై శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్లు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 16: ఎన్నికల నియమావళిపై పీవోలు, ఏపీవోలు అవగాహన కల్గి ఉండాలని డ్వామా ఏపీడీ చిన్నరెడ్డన్న, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి సూచించారు. శనివారం డీఆర్వో చిన్నయ్య, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, జడ్పీ సమావేశ మందిరంలో నాల్గవ రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం ఈవీఎంలు ఎలా వినియోగించాలన్న దానిపై అవగాహన కల్పించారు. డిప్యూటీ కలెక్టర్ శివయ్య, బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బానీ, ఏపీడీ ఉమాదేవి, మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ సౌందర్‌రాజన్, ఉమమహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేటమిట్టలో 'ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్'


గల్లా రామచంద్రనాయుడిని సన్మానిస్తున్న ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ సంస్థ మహిళలు

పూతలపట్టు, మార్చి 16: పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామాన్ని ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ సంస్థ మహిళలు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అమరరాజా సంస్థల వ్యవస్థాపకుడు గల్లా రామచంద్ర నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పేటమిట్టలో రామచంద్రనాయుడు చేసిన అభివృద్ధి పనులను పరిశీలించి, సంతోషం వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్, అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి, సభ్యులు శశిబిందు, శ్రీదేవి, సరిత, అనుపమ, కోమల, సులోచన తదితరులు పాల్గొన్నారు.

నేటి గ్రూప్-1 పరీక్షలకు సర్వం సిద్ధం: కలెక్టర్

చిత్తూరు (సెంట్రల్), మార్చి 16: జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న ఏపీపీఎస్‌ఈ గ్రూప్-1 పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. 2,517 మంది అభ్యర్థుల కోసం ఎస్వీసెట్, సీతమ్స్, పీవీకేఎన్ ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థుల సందేహాలు నివృత్తికి కలెక్టరేట్‌లో 94910 77356 నెంబరుతో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలోనూ అన్ని వసతులు కల్పించామన్నారు. నిర్దేశించిన సమాయానికి నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని అభ్యర్థులు గుర్తుంచుకోవాలని సూచించారు.

రేపటినుంచి టెన్త్ పరీక్షలు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 16: జిల్లాలో సోమవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. 22594 మంది పరీక్షలు రాయనున్నారన్నారు. వీరిలో.. 22119 మంది రెగ్యులర్, 1395 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. వీరికోసం 116 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 11 రూట్లు ద్వారా 33 స్టోరేజ్ పాయింట్లకు ఇప్పటికే ప్రశ్నపత్రాలు తరలించి, భద్రపరిచామని వివరించారు. ఆరు సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిర్దేశించిన సమాయానికి గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయవచ్చన్నారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు తలెత్తితే డీఈవో కార్యాలయంలో 90321 85001 నెంబరుతో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలన్నారు.

తిరుపతి జేసీగా ధ్యానచంద్ర



తిరుపతి(కలెక్టరేట్), మార్చి 16 : జాయింట్ కలెక్టర్‌గా ధ్యానచంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. ఇక్కడ జేసీగా పని చేస్తున్న శుభం బన్సల్ శాప్ ఎండీగా బదిలీ అయిన విషయం విదితమే. ధ్యానచంద్రకు ఆర్డీవో పెంచలకిషోర్, ఎస్డీసీ భాస్కర్‌నాయుడు, సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని, కలెక్టరేట్ ఏవో నరసింహారావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

వామ్మో ఎంత పెద్ద పామో


పట్టుబడిన నాగుపాము

తిరుమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అలిపిరి నడక మార్గంలో నాగుపాము భక్తులను బెంబేలెత్తించింది. సుమారు ఆరడుగుల పాము 3,300 మెట్ల వద్దకు వచ్చింది. దాన్ని చూసిన భక్తులు భయంతో కేకలు వేస్తూ, పరుగులు తీశారు. కొంత సమయానికి అది దగ్గర్లో సేపాల్ భద్రతా సిబ్బంది బస చేసే షెడ్ లోపలికి ప్రవేశించింది. వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని దాన్ని పట్టుకుని అవ్వాచారి కోనలో వదిలేశారు.

ఏడీఎంఈలుగా ఇద్దరికి పదోన్నతులు


డాక్టర్ రవిప్రభు - డాక్టర్ మల్లీశ్వరి

తిరుపతి(వైద్యం), మార్చి 16 : వైద్య విద్యా, కుటుంబ సంక్షేమ శాఖలో ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న ఇద్దరికి అదనపు వైద్య విద్యా సంచాలకులు(ఏడీఎంఈ)గా పదోన్నతి ఇస్తూ డీఎంఈ డాక్టర్ నరసింహం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరుగురు ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించగా వారిలో ఎస్వీ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి, రుయాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభు, ఎస్వీ వైద్య కళాశాల చిన్నపిల్లల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ డి.మల్లీశ్వరి ఉన్నారు. వీరిలో డాక్టర్ రవిప్రభుకు రుయాస్పత్రి సూపరింటెండెంట్‌గా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ అదే స్థానంలో ఉంచగా డాక్టర్ మల్లీశ్వరిని పులివెందులలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

రూ.2లక్షల సొత్తు స్వాధీనం


మీడియాకు వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి

యాదమరి, మార్చి 16: అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.2 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వివరాలను యాదమరి పోలీసుస్టేషన్ ఆవరణంలో శనివారం రూరల్ సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్ఐ రామాంజనేయులుతో కలిసి చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి మీడియాకు తెలిపారు. 2020 డిసెంబరు 13వ తేదీన చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలోని గుడిపాల వద్ద చెన్నై వైపు వెళ్తున్న మినీ లారీని అడ్డగించి అంతర్రాష్ట్ర దొంగల ముఠా అడ్డగించింది. మరణాయుధాలు చూపించి, డ్రైవర్ వద్ద నుంచి రూ.6200 దోచుకెళ్లింది. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పట్లో గుడిపాల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. అలాగే ఈనెల 14వ తేదీన తిరుపతి - బెంగళూరు రోడ్డులోని రామభద్రాపురం వద్ద బద్వేలు నుంచి నువ్వులు లోడుతో తమిళనాడుకు వెళ్తున్న లారీని అడ్డగించారు. డ్రైవర్‌ని కత్తులతో బెదిరించి, రూ.18వేలను దోపిడీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు యాదమరి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో ఈనెల 15న యాదమరి మండలం తుమ్మిందపాళ్యం క్రాస్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. తుమ్మిందపాళ్యం నుంచి యాదమరి వైపుగా రెండు ద్విచక్ర వాహనాల్లో వచ్చిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వీరే నిందితులుగా గుర్తించారు. వారి వద్ద నుంచి ఆరు కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, రూ.18వేలు, ఐదు కత్తులు, ఓ బ్లూటూత్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని డీఎస్పీ చెప్పారు. కేసు విచారణలో ఉందని, నిందితుల వివరాలను ప్రస్తుతం వెల్లడించలేమన్నారు. నిందితులను పట్టుకున్న రామారావు, గోపినాథ్, బాల, సుబ్రహ్మణ్యంలను డీఎస్పీ అభినందించారు.

సంగీతంతో మానసిక ఆరోగ్యం


కార్యక్రమంలో విద్యాపీఠం వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 16 : సంగీతంతో మనిషి మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని జాతీయ సంస్కృత యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. పద్మావతి యూనివర్సిటీ సంగీత, నృత్య విభాగంలో రెండు రోజులుగా నిర్వహించిన జాతీయ సదస్సు ముగింపు సభ శనివారం నిర్వహించారు. వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తిగాన రసం ఫణి అనే శ్లోకాన్ని గుర్తు చేశారు. సంగీతం సకల జీవులను ఆహ్లాదమయం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సంగీతం పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. తద్వారా మానసిక ప్రశాంతతను పొందాలని ఆకాంక్షించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన సదస్సులో భాగంగా చేపట్టిన సమాంతర సదస్సుల్లో 32 పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ శైలేశ్వరి, కో-కన్వీనర్ ప్రొఫెసర్ యు.హిమబిందు పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి


వసంత (పాతచిత్రం)

వరదయ్యపాళెం, మార్చి 16: మండలంలో ఒంటరి మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఒకరోజు ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి వరదయ్యపాళెం పోలీసుల కథనం మేరకు వివరాలిలా... మండలంలోని పాండూరు పంచాయతీ పాదిరికుప్పంకు చెందిన అన్నంబేటి వసంత(43) భర్త వదలివేయడంతో 14 సంవత్సరాలుగా ఒంటరిగా పిల్లలతో జీవిస్తోంది. ఓ పరిశ్రమలో పనిచేస్తూ తన ఇద్దరు పిల్లలను పోషించుకుంటోంది. కుమారుడు (16) పుత్తూరులో ఇంటర్ చదువుతున్నాడు. కుమార్తె(14) సత్యవేడు మండలంలోని హాస్టల్‌లో ఉంటూ 9వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో కుమారుడికి ఇంటర్ పరీక్షలు ముగియడంతో శుక్రవారం ఇంటికి వచ్చి చూడగా తల్లి ఉరి వేసుకుని ఉండటంతో భయపడి తాతకు తెలియజేయడంతో పోలీసులు సమాచారం ఇచ్చారు. సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్ఐ ప్రతాప్ అక్కడికి చేరుకున్నారు. మూడు రోజుల క్రితం ఉరివేసుకున్నట్టు పోలీసులు నిర్ధారించారు. ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. తన పిల్లల పోషణ భారంగా మారడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు గోడకు రాసి ఉండటం గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీకాళహస్తి టీడీపీలో అసమ్మతి ప్రచారాలకు తెర

● ఎస్సీవీ, మునిరామయ్యలతో సుధీర్‌రెడ్డి భేటీ


ఎస్సీవీ నాయుడితో సుధీర్ రెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి, మార్చి 16: శ్రీకాళహస్తి టీడీపీలో విభేదాలున్నాయంటూ జరిగిన ప్రచారం పూర్తి అవాస్తవమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ప్రకటించారు. రెండు రోజుల క్రితం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థిగా బొజ్జల సుధీర్ రెడ్డి పేరును ప్రకటించిన విషయం తెలిసిందే. టికెట్ ఆశించిన ఎస్సీవీ నాయుడి వర్గం అసంతృప్తి ఎటువైపు దారితీస్తుందో అన్న ప్రచారం జోరుగా సాగింది.అయితే శనివారం ఎస్సీవీ ఇంటికి సుధీర్ రెడ్డి వచ్చారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, వెంకటగిరి, సత్యవేడు, తిరుపతి రూరల్ ప్రాంతాల్లో ఎస్సీవీ నాయుడికి మంచి పట్టుందన్నారు.సత్యవేడులో వైసీపీ నుంచి వచ్చిన వారికి తనను సంప్రదించకుండానే టికెట్ ప్రకటించడంపై ఎస్సీవీ నాయుడు కలత చెందిన విషయం వాస్తవమేనన్నారు.తనను ఆశీర్వదించి గెలిపిస్తే ఆయన అడుగుజాడల్లో పని చేస్తానని ప్రకటించారు. అలాగే ఆయనకు ఎమ్మెల్సీ లేదా రాజ్యసభ సభ్యత్వం వంటి గౌరవప్రద స్థానం కల్పించేందుకు పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేస్తానని చెప్పారు.ఇక శ్రీకాళహస్తిలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులను కూడా కలిసి ఒక్కటిగా ముందుకు సాగుతామన్నారు.మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు మాట్లాడుతూ భవిష్యత్ కార్యాచరణ సమావేశం కేవలం తనతోపాటు తన వర్గం నాయకులకు టీడీపీ అధిష్ఠానం నుంచి భరోసా పొందడంపై చర్చించేందుకే అన్నారు. గత ఎన్నికల్లో బియ్యపు మధుసూదన రెడ్డిని గెలిపిస్తే తీవ్ర ద్రోహం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఓటమి కోసమే తాను అహర్నిశలూ శ్రమిస్తానని ప్రకటించారు. అనంతరం సుధీర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే సత్రవాడ ముని రామయ్య ఇంటికి వెళ్లి తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.ఆయన కూడా సానుకూలంగా స్పందించి ఎన్నికల్లో అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. మొత్తంగా శనివారం జరిగిన పరిణామాలతో టీడీపీలో అసమ్మతి ప్రచారాలకు తెరపడింది.సుధీర్‌రెడ్డి వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గురవారెడ్డి, నాయకులు మునిరాజ నాయుడు, విజయ్‌కుమార్, కంఠా రమేష్ పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తలా నగరపాలక కమిషనర్

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరోపణ


మీడియాతో మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్

చిత్తూరు సిటీ, మార్చి 16: చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ క్రమశిక్షణ కలిగిన వైసీపీ కార్యకర్తలా పనిచేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. చిత్తూరు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి ఆదేశాలను ఆమె తూచా తప్పక పాటిస్తున్నారని విమర్శించారు. నగరంలో అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీలు ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తున్నాయని, టీడీపీకి చెందిన ఫ్లెక్సీలను మాత్రం తొలగించారని చెప్పారు. కమిషనర్ ఇలాగే ఉంటే.. చిత్తూరులో ఎన్నికలు స్వేచ్ఛగా జరిగే అవకాశం కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆమెను తక్షణం బదిలీ చేయాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. అలాగే వలంటీర్లు, గ్రామ సచివాలయ, వెలుగు సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరామని అన్నారు. సమావేశంలో నేతలు మోహన్‌రాజ్, మేషాక్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో శాస్త్రోక్తంగా శాంతి అభిషేకం


అలంకార మండపంలో ఉత్సవర్లను అభిషేకిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, మార్చి 16: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో ఉత్సవమూర్తుల శాంతి అభిషేకం శాస్త్రోక్తంగా జరిగింది. మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిసిన తరవాఅత రోజు ఉత్సవమూర్తులకు శాంతి అభిషేకం నిర్వహించడం సంప్రదాయం. ఇందులో భాగంగా శనివారం ముక్కంటి ఆలయంలోని అలంకార మండపం వద్ద విశేష పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అనువంశిక ప్రధానార్చకుడు స్వామినాథన్ గురుకుల్ కలశ స్థాపనతో సంకల్ప పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు విశేషాభిషేకాలను నిర్వహించారు. ఉత్సవాల్లో తెలియక పొరపాట్లు జరిగి ఉంటే ప్రాయశ్చిత్తంకోసం శాంతి హోమం చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ దర్శనాలపై అభ్యంతరం

ఎన్నికల నియమావళి అమలైనప్పటికీ రాజకీయ ప్రొటోకాల్ దర్శనాలు కొనసాగించడంపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ఆదివారం అధికార పార్టీ ఎమ్మెల్యే ముక్కంటి దర్శనానికి వస్తున్నట్లుగా.. వారికి ప్రొటోకాల్ దర్శనాలు చేయవలసిందిగా ఆలయంలోని ఓ కీలక అధికారి సిబ్బందికి మెసేజ్ పంపించారు. ఇది గ్రూపులో చూసిన ఆలయ ఉద్యోగులు ఎన్నికల నియమావళిలో కూడా ప్రొటోకాల్ దర్శనాలు కొనసాగించవచ్చా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అలాగే పలువురు దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.39 కోట్లు

తిరుమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.39 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 66,322 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,672 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు


అశ్వినిదత్ - తమన్, అశ్విన్ బాబు

తిరుమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోనా రఘుపతి, తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరని శ్రీనివాసులు, సినీ నిర్మాత అశ్వనీదత్, సంగీత దర్శకుడు తమన్, హీరో నాగ అశ్విన్ బాబు, ఎమ్మెల్సీలు పోతుల సునీత, సిపాయి సుబ్రహ్మణ్యం ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

నేడు నామినికి మాండలిక బ్రహ్మ అవార్డు ప్రదానం

తిరుపతి (కల్చరల్), మార్చి 16: ప్రముఖ రచయిత నామిని సుబ్రహ్మణ్యం నాయుడికి ఆదివారం మాండలిక బ్రహ్మ అవార్డు ప్రదానం చేయనున్నారు. రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు గల్లా రామచంద్ర నాయుడు, గల్లా అరుణకుమారి, రమాదేవి ఈ అవార్డు ప్రదానం చేస్తారు. కరకంబాడీలోని అమరరాజా ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు శ్వేత సంచాలకులు భూమన్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ప్రజాకవి గోరటి వెంకన్న, ప్రముఖ పాత్రికేయుడు తాడి ప్రకాష్, గాయకుడు పుట్టా పెంచలదాసు హాజరుకానున్నారు.

రేపటి నుంచి రీసెర్చ్ మెథడాలజీపై కోర్సు ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 16 : ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ పరిధిలో రీసెర్చ్ మెథడాలజీపై వారం పాటు ప్రత్యేక కోర్సు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి ఈ కోర్సును ప్రారంభించనున్నారు. పరిశోధనా విధానంపై పీహెచ్‌డీ స్కాలర్లకు అవగాహన కల్పిస్తారు. ఆర్ట్స్ కాలేజీ పరిధిలోని అన్ని విభాగాలకు చెందిన పీహెచ్‌డీ స్కాలర్లు తప్పనిసరిగా హాజరుకావాలని అధికారులు కోరారు. ఈ మేరకు వర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మనాభం, వైస్ ప్రిన్సిపాల్ శ్యాంమోహన్‌డేవిడ్‌రాజు తెలిపారు.

సైబర్ నేరగాడి అరెస్టు


పోలీసుల అదుపులో బాలాజి

తిరుపతి క్రైం మార్చి 16 : ఆన్‌లైన్ ద్వారా మోసాలకు పాల్పడుతున్న నేరగాడిని శనివారం తిరుపతి యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతి సీఐడీ పోలీసుల వివరాల మేరకు.. తిరుపతికి చెందిన మరిచర్ల బాలాజీ ఓఎల్ఎక్స్‌లో పాత మొబైల్ ఫోన్లు అమ్మే నిమిత్తం ప్రకటనలు పోస్టు చేస్తాడు. ఫోన్ కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తిని నేరుగా కలిసి ఫోన్ చూడమని చెబుతాడు. అవతలి వ్యక్తికి ఫోన్ నచ్చితే తను చెప్పిన నంబరుకు యూపీఐ ద్వారా నగదు బదిలీ చేయించుకుంటాడు. నగదు బదిలీ అయిన తర్వాత ఈ విషయం ఎవరికీ చెప్పవద్దని, ఇప్పుడే ఫోన్ తీసుకుని వస్తానని చెప్పి అక్కడి నుంచి ఉడాయిస్తున్నాడు. తర్వాత సదరు నంబర్‌ను బ్లాక్ చేస్తున్నాడు. ఇదే తరహాలో మోసపోయిన షేక్ ఫయాజ్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు బాలాజీని పట్టుకుని విచారించగా అతనిపై 23కేసులు ఉన్నట్లు సైబర్ క్రైం పోర్టల్ ద్వారా పోలీసులు గుర్తించారు.

శ్రీకాళహస్తీశ్వరుడి సేవలో ఐపీఎస్ అధికారి



శ్రీకాళహస్తి, మార్చి 16: తమిళనాడుకు చెందిన ఐపీఎస్ అధికారి, ఇంటిలిజెన్స్ డైరెక్టర్ జనరల్ ప్రమోద్ కుమార్ శనివారం ముక్కంటి ఆలయాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అధికారులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

రూ.1.50కోట్లకు పెరిగిన అప్పుల చిట్టా

- బయటకు వస్తున్న మరికొందరు బాధితులు
- ఇక్కడ నిందితురాలే..మరో చోట బాధితురాలు
- న్యాయం చేయాలని ఎస్పీని ఆశ్రయించిన కవిత
- మదనపల్లెకు రప్పించేందుకు పోలీసుల యత్నం

మదనపల్లె, మార్చి 16: అప్పుల బాధ భరించలేక పరారైన నిందితురాలు కవిత..స్థానికంగా చేసిన అప్పుల చిట్టా మరింత పెరుగుతోంది. పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో తామూ అప్పులు ఇచ్చి మోస పోయామంటూ ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి వరకూ ప్రాథమికంగా 30 మంది నుంచి రూ.1.20కోట్లు ఉండవచ్చని అంచనాకు వచ్చిన బాధితులు..శనివారానికి రూ.1.50కోట్లు అయినట్లు చెబుతున్నారు. కవిత..తీసుకున్న అప్పులు సకాలంలో చెల్లించకపోవడంతో వారంరోజులుగా కవిత, బాధితుల మధ్య వివాదం జరుగుతోంది. ఈ క్రమంలో ఇంటి నుంచి పరారైందని తెలుసుకున్న స్థానికులు..ఇంటి, ఆమె నిర్వహిస్తున్న చిల్లర దుకాణం వద్దకు చేరుకుని ఆమె భర్తతో వాదనకు దిగడంతో వివాదం పెద్దదైంది. తమకు న్యాయం చేయాలని బాధితులు ఆందోళన చేయడంతో తాలూకా పోలీసులు రంగప్రవేశం చేయడంతో వివాదానికి తాత్కాలికంగా తెరపడింది. దీనికి కొనసాగింపుగా శనివారం కూడా బాధితులు..ఆమె ఇంటి వద్దకు చేరుకుని, అక్కడే ఉన్న కవిత భర్త దేవేంద్రతో వాదనకు దిగడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. అటు నిందితులు, ఇటు బాధితులను పిలిపించి మాట్లాడారు. ఇక్కడ ఇలా బాధితులు రోడ్డెక్కుతుంటే..తానూ మోస పోయానని తనకు న్యాయం చేయాలని నిందితురాలు కవిత...జిల్లా కేంద్రం రాయచోటికి చేరుకుని ఎస్పీ కృష్ణారావును ఆశ్రయించింది. ఇలా ఇక్కడ నిందితురాలే..అక్కడ బాధితురాలిగా తెలుస్తోంది. దీనిపై మదనపల్లె తాలూకా పోలీసులు..కవిత ఆరోపించిన వ్యక్తిని పిలిపించి శనివారం విచారణ చేపట్టారు. ఇద్దరి మధ్య రూ.25 లక్షలు మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. అయితే పరారీలో ఉన్న నిందితురాలు కవితను విచారిస్తే కానీ..మరిన్ని వివరాలు తెలీవని పోలీసులు చెబుతున్నారు. ఈక్రమంలో ఆమెను మదనపల్లెకు రప్పించే పోలీసులు, ఆమె బంధువుల ద్వారా ప్రయత్నం చేస్తున్నట్లు తెలిస్తోంది.

వివాదస్థలంలో నిర్మాణాలకు యత్నం

పీలేరు, మార్చి 16: పీలేరులో ఓ వివాదాస్పద స్థలంలో కొంత మంది అర్ధరాత్రి పూట నిర్మాణాలకు పూనుకోవడం, వాటిని స్థానికులు అడ్డుకోవడం, ఇరువురి మధ్య వాగ్వాదం చెలరేగడంతో టెన్షన్ నెలకొంది. పీలేరు పట్టణం సర్వే నెం.164, 139లో ఆరు అంకణాల ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంపై యాజమాన్య హక్కుల కోసం పట్టణానికి చెందిన పప్పు రెడ్డప్ప, శ్రీనివాసులు ఆచారీ అనే ఇద్దరు వ్యక్తులు హైకోర్టులో వ్యాజ్యం వేసి ఉన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి కొంత మంది వ్యక్తులు ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టేందుకు నిర్మాణ ఇనుప పిల్లర్లు, రెడీమేడ్ పైకప్పులను అక్కడకు చేర్చుకుని స్థలాన్ని చదును చేయడం ప్రారంభించారు. ఆ సంగతి తెలుసుకున్న పప్పు రెడ్డప్ప కుటుంబీకులు హుటాహుటిన అక్కడకు చేరుకుని వారిని అడ్డుకున్నారు. ఈ విషయాన్ని తమ బంధువులకు తెలియజేయడంతో సుమారు 100 మంది అక్కడకు చేరుకోవడంతో నిర్మాణాలు చేపట్టేందుకు వచ్చిన వారు తమ సామగ్రిని తీసుకుని వెనుదిరిగారు. అక్రమంగా నిర్మాణాలు చేపట్టేందుకు వచ్చిన వారు అధికార పార్టీ నేతల అండదండలు ఉన్న వారు కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు అటు రెడ్డప్ప ఇటు శ్రీనివాసులు ఆచారీ వెనకడుగు వేసినట్లు సమాచారం.

విద్యార్థి అదృశ్యం

మదనపల్లె అర్బన్, మార్చి 16: స్థానిక డి గ్రీకళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఈనెల 15న అదృశ్యం అయినట్లు మదనపల్లె రూరల్ సీఐ శేఖర్ తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు శనివారం మిస్సింగ్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వృద్ధురాలికి గాయాలు

మదనపల్లె టౌన్, మార్చి 16: స్థానిక నీరుగట్టువారిపల్లెకు చెందిన కృష్ణమ్మ(65)అనే వృద్ధురాలు శనివారం రోడ్డు ప్రమాదంలో గాయపడింది. తన కుమారుడు సురేష్‌తో కలసి ద్విచక్రవాహనంలో వస్తుండగా కదిరిరోడ్డులో స్పీడ్‌బేకర్‌పై వాహనాన్ని అలాగే పోనిచ్చాడు. దీంతో వెనుక కూర్చున్న కృష్ణమ్మ ఎగిరి కింద పడటంతో ముఖంపై గాయాల య్యాయి. స్థానికులు ఆమెను మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్, మార్చి 16: మదనపల్లె పట్టణ టీడీపీ చేనేత విభాగం అధ్యక్షుడు, పార్లమెంట్ ఐటీడీపీ ఉపాధ్యక్షుడు వేల్పుల వెంకటేశ్ శుక్రవారం రాత్రి ఇంటిలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు అతడిని ఉరి నుంచి తప్పించి రక్షించారు.

350 లీటర్ల నాటుసారా ఊట ధ్వసం

పెద్దమండ్యం, మార్చి 16: నాటుసారా తయారీకి సిద్ధం చేసి 350 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు పెద్దమండ్యం ఎస్ఐ చెన్నకేశవ వెల్లడించారు. మదనపల్లి డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ములకలచెరువు సీఐ తుమ్మశెట్టి మధు ఆదేశాల మేరకు ఎస్ఐ ఆధ్వర్యంలో రామానాయక్‌తండా సమీపంలో శనివారం నాటుసారా బట్టీలను ధ్వంసం చేశారు.

అవినీతి వైసీపీకి ఇక నూకలుచెల్లాయి

- తల్లిని చెల్లిని చూడనోడు రాష్ట్ర పాలకుడు కావడం సిగ్గుచేటు
- పీలేరు టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ధ్వజం



చింతపర్తిలో నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని గజమాలతో స్వాగతిస్తున్న టీడీపీ జనసేన నాయకులు, యువత

వాల్మీకిపురం, మార్చి 16: అవినీతి, అరాచక వైసీపీ ప్రభుత్వ పాలనకు నూకలు చెల్లాయని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు పార్టీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తల్లిని, చెల్లిని చూడనోడు మన ఆంధ్రప్రదేశ్ సీఎం కావడం రాష్ట్ర దౌర్భాగ్యమని ఆయన ధ్వజమెత్తారు.. శనివారం వాల్మీకిపురం మండలంలోని మద్దెలచెరువుపల్లె, పాతకోటపల్లె, మేకలవారిపల్లె, చారావండ్లపల్లె తదితర గ్రామాలలో టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా గ్రామాలలో ఇంటింటా సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. చింతపర్తి మార్కెట్ యార్డు వద్ద నుంచి చారావాండ్లపల్లె వరకు భారీ ర్యాలీ చేపట్టి నినాదాలతో హోరెత్తించారు. అనంతరం నల్లారి కిశోర్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ గ్రామ గ్రామాన ప్రజలంతా చంద్రబాబునాయుడే మళ్లీ కావాలని కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో టీడీపీ జనసేన బీజేపీ కూటమి వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధించి అధికారం చేపట్టడం ఖాయమన్నారు.

టీడీపీలో పలువురు చేరిక..

వాల్మీకిపురం మండలం పాతకోటపల్లెకు చెందిన పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు టీడీపీలో చేరారు. శనివారం గ్రామానికి చెందిన రాజేష్‌కుమార్‌రెడ్డి, సిద్దారెడ్డి, చింతల భార్గవి, శంకర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, శ్రీరాములు, రమణ, గణేష్‌కుమార్‌రెడ్డి, రామచంద్ర, శ్రీనివాసులురెడ్డి, ఆదినారాయణ మరో పది కుటుంబాలు టీడీపీలో చేరగా నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో పీలేరు టీడీపీ, యువత అధ్యక్ష, ఉపాధ్యక్షులు మహీధర్‌రెడ్డి, లంకిపల్లె మధు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ మహిత శేషాద్రిరెడ్డి, పీలేరు టీడీపీ తెలుగు యువత ఉపాధ్యక్షుడులంకిపల్లె మధు, జనసేన మండల అధ్యక్షుడు కిశోర్, నాయకులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

కిశోర్‌ను గెలిపించి.. అభివృద్ధికి సహకరించాలి

కలికిరి, మార్చి 16: ఎన్నికల్లో టీడీపీ పీలేరు నియోజక అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిని గెలిపించి అభివృద్ధికి సహకరించాలని ఆయన సతీమణి నల్లారి తనూజా రెడ్డి కోరారు. శనివారం కలికిరి పంచాయతీలో సూపర్ సిక్స్ పథకాలపై ఇం టింటి ప్రచారం నిర్వహించారు. శనివారం పంచాయతీలోని యల్లమ్మగు డి వీధి, నల్లారివాండ్లపల్లె, కాలేజీ రోడ్డు, పొట్టికులవారిపల్లె, రెడ్డివారిపల్లె, ఇందిరా నగర్, శీనయ్య కాలనీ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ పర్యటనలో కలికిరి సర్పంచు ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఎంపీటీసీ గాయత్రి, నిజాముద్దీన్, సునీల్ కుమార్ రెడ్డి, లాయర్ యల్లా రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, చంద్రా రెడ్డి, రాజా రెడ్డి, శ్రీమన్నారాయణ రెడ్డి, సహదేవ రెడ్డి, ఆర్టీసీ రెడ్డెప్ప రెడ్డి, కేవీ రెడ్డి, విజయకుమార్ రెడ్డి, రమేష్ చెట్టి, రాజన్న, అఫ్రోజ్ బాషా, వర్మ, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.



సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న తనూజా రెడ్డి

టీడీపీ కార్యాలయం ప్రారంభం

గుర్రంకొండ, మార్చి 16: మండలంలోని మర్రిపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని శనివారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సైనికుల్లాగా పని చేయాలన్నారు. అలాగే మర్రిమాకులపల్లె మాజీ సర్పంచ్ రెడ్డెప్పరెడ్డి తల్లి నాగలక్ష్మీ మృతి చెందిన విషయం తెలుసుకుని ఆమె భౌతికకాయానికి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, జయసూరి, దిలీప్, బయ్యారెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 112 కేసులు పరిష్కారం

మదనపల్లె, మార్చి 16: మదనపల్లె కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 112 కేసులు పరిష్కారమయ్యాయి. ఇన్‌చార్జి సెకెండ్ ఏడీజే శాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 16 సివిల్ కేసులు, 96 క్రిమినల్ కేసులు రాజీ అయి పరిష్కారమయ్యాయి. బాధితులకు రూ.70.50 లక్షలు పరిహారం అందించారు.

పీలేరు లోక్ అదాలత్‌లో 38 కేసులు ..

పీలేరు, మార్చి 16: పీలేరులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 38 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ కేసులకు సంబంధించి కక్షిదారులు మధ్య రూ.45.25 లక్షల చెల్లింపులు జరిగాయి. లోక్ అదాలత్ కోసం 11వ అదనపు జిల్లా కోర్టులో 8వ అదనపు జిల్లా జడ్జి సుంకర శ్రీదేవి ఒక బెంచ్ నిర్వహించగా, పీలేరు సీనియర్ సివిల్ జడ్జి కె.రవి రెండవ బెంచ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు తెనాలి రామసుబ్రహ్మణ్యం, పీవీ రమణారెడ్డి, న్యాయవాదులు రామకుమార్ రెడ్డి, షౌకత్‌అలీ, వేణు, మహమ్మద్ అలీ, పోలీసు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లిలో: తంబళ్లపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్ లో 4 కేసులు పరిష్కారమైనట్లు మండల న్యాయసేవా సంఘం అధ్యక్షుడు ఇన్‌చార్జ్ జడ్జి ఐ. ప్రవీణ్ కుమార్ తెలిపారు. సీసీ ఐపీసీ కి సంబంధించి 3 కేసులు, ఒఎస్ (మనీ) కి సంబంధించి ఒక కేసు వాది ప్రతివాది ఇరువురి సయోధ్య అంగీకారాలతో పరిష్కరించినట్లు తెలిపారు. పరిష్కారమైన కేసులకు సంబంధించి రూ. 1,70,000 రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ రామకృష్ణ, బార్ అసోసియేషన్ చైర్మన్ నాగమల్‌రెడ్డి, లోక్ అదాలత్ అడ్వకేట్ గఫార్ సాహెబ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

మదనపల్లె అర్బన్, మార్చి 15: ఏపీకి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు ఎస్ రెడ్డిసాహెబ్ అన్నారు. శనివారం పట్టణంలోని స్థానిక మున్సిపల్ 11, 12 వార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ కొత్తగా తీసుకొచ్చిన సంక్షేమ పథకం ఇంటింటా ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్రమహిళా ఉపాధ్యక్షురాలు మీనాకుమారి, జిల్లా ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు రవీంద్ర, మదనపల్లె రూరల్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, నిమ్మనపల్లె మండల అధ్యక్షుడు ముబారక్ ఖాన్, నాయకులు ఎస్ఎం రఫీ, సయ్యద్, ఈశ్వరమ్మ, మహమ్మద్‌అలీ, సమీర్, మహబూబ్‌పీర్, శరత్‌కుమార్‌రెడ్డి, నాగరాజు, అమీర్ఖాన్, దిలీప్, అర్షద్, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు కొత్త ప్రిన్సిపాల్

కలికిరి, మార్చి 16: కలికిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కొత్త ప్రిన్సిపాల్‌ను నియమించారు. రైల్వే కోడూరు కళాశాలలో భౌతిక శాస్త్రం అధ్యాపకుడుగా వున్న ఎంవీ విజయకుమార్ పదోన్నతి కల్పించి కలికిరి ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. శనివారం ఆయన ప్రిన్సిపాల్ స్వరూప నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఆయనకు అభినందనుల తెలిపారు.

ఘనంగా అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి



స్థానిక జడ్పీహైస్కూల్‌లో పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

మదనపల్లె అర్బన్, మార్చి 16: మదనపల్లె వాసవీక్లబ్, వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్రం కోసం పోరాడిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి వాసవీక్లబ్ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్‌లో పేదలకు వాసవీక్లబ్, వనితా క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.వాసవీక్లబ్ కార్యదర్శి అమరనాథ్, వాసవీక్లబ్ సభ్యులు శ్రీనాథ్, అమరనాథ్, లక్ష్మీదీపక్ , వీవీ కృష్ణారావు, వాసవీ వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

మదనపల్లె టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు అమరజీవి అని ప్రభుత్వాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో అమరజీవి పొట్టిశ్రీరాములు125వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బి. కొత్తకోటలో: ఆంధ్రప్రదేశ్ అవతరణ కోసం అశువులుబాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని బి. కొత్తకోటలో ఘనంగా నిర్వహించారు. మండలప్రజా పరిషత్ కార్యాలయంలో ఏఓ థామస్, ఎమ్మార్వోలో ఎంఈవో రెడ్డిశేఖర్, వాకర్స్ ప్రాంగణంలో అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జడ్పీ హైస్కూల్‌లో నక్కా మహేష్, కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ క్లబ్ ప్రతినిధులు పొట్టి శ్రీరా ములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమా లలో హెచ్ఎం భాస్కర్, శైలజ, కోగర మాదవ, నాగభూషణం, ఓలేటి ప్రసాద్, కృష్ణమూర్తి, ప్రభాకర్, బద్రి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న అధికారులు

చీటీల బాధితులకు న్యాయం చేయాలి

మదనపల్లె, మార్చి 16: చీటీల స్కామ్‌లో నష్టపోయిన తమకు న్యాయం చేయాలని మదనపల్లెకు చెందిన కొందరు బాధితులు శనివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి విన్నవించారు. మదనపల్లె పట్టణంలోని వీఎస్ఆర్ గ్రాండ్ అధినేత వి.సుధాకర్‌రెడ్డి వద్ద తాము చీటీలు వేసి తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. తమకు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ అవసరాలకు చీటీలు వేసుకున్న డబ్బు ఉన్నఫళంగా లేదంటే తామంతా ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశముందని మంత్రిదృష్టికి తీసుకెళ్లగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు బాధితులు పేర్కొన్నారు.

బీసీలకు రాజకీయ ప్రాధాన్యమివ్వాలి

పెద్దమండ్యం, మార్చి 16: బీసీలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని తంబళ్లపల్లి నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బిక్కా మధుకర పేర్కొన్నారు. పెద్దమండ్యంలో శనివారం ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లి నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికలల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీ సామాజిక వర్గానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ నియోజక వర్గంలో బీసీలు అధిక శాతం ఉన్నారని తెలిపారు. బీసీలకు తగిన పాధాన్యత ఇవ్వకుండ రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు.

బలిజ సేన రాష్ట్ర కార్యదర్శిగా రమణ

పెద్దతిప్పసముద్రం మార్చి 16 : ఆంధ్రప్రదేశ్ బలిజ సేన రాష్ట్ర కార్యదర్శిగా పీటీఎం మండలం కాయలవాండ్లపల్లెకు చెందిన పీవీ రమణ నియమితులయ్యారు. ఏపీ రాష్ట్ర బలిజ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ నుంచి బలిజ సేన రాష్ట్ర కార్యదర్శిగా నియామక పత్రాన్ని తనకు పంపించినట్లు రమణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో తనకు రాష్ట్ర స్థాయిలో ఉన్నత పదవి అందించినందుకు ముందుగా వ్యవస్థాపకులైన ఆర్కాట్ కృష్ణప్రసాద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న కాపు, బలిజ, ఒంటరి, మున్నూరు కాపు, తూర్పుకాపుల సంక్షేమమే ధ్యేయంగా వారి అభివృద్ధికి తన వంతు సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.

కేంద్ర బలగాలతో పోలీసుల కవాతు

పెద్దతిప్పసముద్రం మార్చి 16 : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మదన పల్లె డీఎస్పీ ప్రసాదరెడ్డి, మొలకలచెరువు సీఐ తమ్మిశెట్టి మధు ఆదేశాల మేరకు బూచిపల్లెలో పీటీఎం ఎస్ఐ రవీంద్రబాబు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్రబాబు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం, ధైర్యం కల్పించడానికి కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ఏఎస్ఐ గోపాల్ నాయక్, వెంకటస్వామి, హెడ్ కానిస్టేబుళ్లు ఉన్నారు.

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి



ఎంసీసీ అధికారులకు సూచనలిస్తున్న రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హరిప్రసాద్

మదనపల్లె టౌన్, మార్చి 16: మదనపల్లె నియోజకవర్గంలో ఎంసీసీ అధికారులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హరిప్రసాద్ ఆదేశించారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంపీడీవోలు, తహసీల్దార్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన 24 గంటల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్తుల పై రాజకీయ నాయకులు చిత్రపటాలు, విగ్రహాలు, సంక్షేమపథకాల ప్రకటనలు తొలగించాల న్నారు. అలాగే సినిమా థియేటర్ యజమానులు, ప్రింటింగ్‌ప్రెస్ యజమానులు, ఫంక్షన్‌హాళ్ల యజమానులతో మాట్లాడుతూ రాజకీయ నాయకులకు చెందిన వ్యాపార లావాదేవీలకు ప్రతి ఒక్కటికి బిల్లులు ఖచ్చితంగా ఇవ్వాలని, తప్పుడు బిల్లులు, రసీదులు ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నియమావళి అనుసరించి ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు.

ఈసీ ఆదేశాలను ప్రతి ఒక్కరూ పాటించాలి

నిమ్మనపల్లి, మార్చి 16: ఎన్నికల కమిషన్ ఆదేశాలను ప్రతి ఒక్కరూ పాటించాలని లేక పోతే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ బాలాజిరాజు అధికారులనుకు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బీఎల్‌వోలకు, పంచాయతి కార్యదర్శులకు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో వున్నందున ఉద్యోగస్తులు ఏ రాజకీయపార్టీకు వత్తాసు పలకరాదన్నారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాలలో ఎక్కువ మంది వుండరాదని, ప్లెక్సీలు, గోడరాతలు చెరిపివేయాలన్నారు. విగ్రహలకు ముసుగు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శాలెట్, ఎంఈవో నారాయణ, పోలీస్ సిబ్బంది, తదితరుల పాల్గొన్నారు.

నియమావళిని పాటించకపోతే కఠిన చర్యలు తప్పవు

పెద్దతిప్పసముద్రం మార్చి 16 : ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు, ప్రభుత్వ అధికారులు ఎన్నికల నియమావళిని తూ.చ. తప్పక పాటించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని పీటీఎం ఎస్ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు. ప్రవర్తనా నియమావళిని అమలు చేయడం మన అందరి బాధ్యత అని అన్నారు. మండలంలోని ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు, నాయకులు, ప్రభుత్వ అధికారులు జాగ్రత్తగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎన్నికలు పూర్తయ్యే వరకు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిమ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫొటోలు, వాల్ పోస్టర్లు, ప్రభుత్వ కార్యాలయాల గోడలకు ఉన్న వాల్ రైటింగ్‌లు ఉంటే తక్షణం తొలగించాలన్నారు. ఆయా గ్రామాల పరిధిలో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు ధరించాలన్నారు.

టీడీపీ అధికారం చేపట్టగానే జిల్లాగా మదనపల్లె

- మదనపల్లె ప్రజలకు పెద్దిరెడ్డి కుటుంబం తీవ్రద్రోహం చేసింది
- మదనపల్లెను ఐటీ హబ్ చేస్తా
- టీడీపీ అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మార్చి 16: ఎన్నికల్లో టీడీపీ,జనసేన, బీజేపీ కూటమి విజయం తథ్యమని చంద్రబాబు సీఎం అయిన నెలలోనే మదనపల్లె కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటుచేస్తామని మదనపల్లె టీడీపీ అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం టీడీపీ శ్రేణులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లె ప్రజలకు పెద్దిరెడ్డి కుటుంబం తీవ్ర ద్రోహం చేసిందన్నారు. మదనపల్లె జిల్లా కేంద్రం కాకుండా అడ్డుకున్నారన్నారు. దీని వలన ఆటో రంగానికి చెందిన వేలాది కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తూనే చెన్నై, బెంగళూరు, మదనపల్లె కారిడార్‌గా మదనపల్లెలో ఐటీ హబ్ ఏర్పాటుకు 100 ఎకరాలు కేటాయిస్తామన్నారు. పట్టణంలో తోపుడు బండ్లతో వ్యాపారం చేసుకుంటూ జీవనం చేసుకుంటున్న వేలాది కుటుంబాలకు అండగా ఉండేందుకు తోపుడుబండ్లకు పన్నులు రద్దు చేస్తామన్నారు. జనసేన నాయకుడు శ్రీరామరామాంజనేయులు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయానికి అందరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చిన్న మహేష్, పెద్ద మహేష్ ఆధ్వర్యంలో 150 మంది టీడీపీలో చేరారు. వీరికి కండువాలు కప్పిన షాజహాన్‌బాషా సాదరంగా అహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ కౌన్సిలర్లు నీలకంఠ, బాబునాయుడు, పులి మహాలక్ష్మి, తలారి రాధ, నాదెళ్ల విద్యాసాగర్, శివన్న, ఎస్ఏ మస్తాన్, సంగం శ్రీనివాసులు, షంషీర్, నాగూర్‌వలి, సిమెంట్ రమణ, వైశ్యాబ్యాంకు రమణ పాల్గొన్నారు. కాగా మదనపల్లె టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషాను స్థానిక వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్ నాగార్జునబాబు(గాంధీ) టీడీపీ నాయ కుడు నాదెళ్ల శివన్నతో కలసి వచ్చి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అలాగే మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు చంద్రశేఖర్, బండి నాగరాజ, నీలకంఠ, ఆంజినేయులు, బాబునాయుడు, నీరుగట్టువారిపల్లె చేనేత నాయకులు కమలామర్రి కృష్ణ, వేమయ్య, శంకర, వేణు, రాధ, మహాలక్ష్మి తదితరులు షాజహాన్‌బాషాకు సంపూర్ణ మద్దతు తెలిపారు.

టీడీపీ గెలుపునకు సహకారాలు అందించండి

మదనపల్లె టౌన్, మార్చి 16: మదనపల్లెలో టీడీపీ గెలుపుకు రాష్ట్రంలో చంద్రబాబు సీఎం కావడానికి సహాయ, సహకారాలు అందించాలని మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, జనసేన కోకన్వీనర్ రాందాస్‌చౌదరిని టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా అభ్యర్థించారు. శనివారం కమ్మవీధిలోని రాందాస్‌చౌదరిని, శివనగర్‌లో దొమ్మలపాటి రమేశ్ నివాసంలో కలసిన షాజహాన్‌బాషా పలు అంశాలపై చర్చించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి బలోపేతం, గెలుపుకు సహాయం చేయాలని కోరారు.

కార్యకర్తలే పార్టీకి వెన్నెముక

రామసముద్రం, మార్చి 16: తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు వెన్నెముక అని వారికి సమస్య వచ్చినా ఎల్లవేళలా అండగా ఉంటానని మదనపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. రామసముద్రం మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు ఆధ్వర్యంలో వందలాదిమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు షాజహాన్‌బాషాను కలిసి పార్టీకి తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ఈసందర్భంగా మండల వైసీపీకి ఆర్.నడింపల్లె వాసి సీహెచ్ వాలెప్ప షాజహాన్‌బాషా సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ మాజీ జడ్పీటీసీ మునివెంకటస్వామి, పార్టీ మాజీ అధ్యక్షుడు చెంగారెడ్డి, మాజీ సర్పంచ్ రెడ్డెప్ప, నాయకులు బద్రినాథ్‌శెట్టి, రామచంద్ర, రమేష్, కృష్ణప్ప, వేణుగోపాల్, గోపాలకృష్ణ, జావీద్, అల్తాఫ్, శమ్ము, మహబూబ్‌బాషా, ఉబేదుల్లా, జనార్దన్, జయప్రకాష్‌నాయుడు, టీస్టాల్ కృష్ణమూర్తి, బీజేపీ నాయకులు ఆనందకుమార్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మదనపల్లెలో ఉమ్మడి అభ్యర్థిని గెలిపిద్దాం



పార్టీశ్రేణులతో మాట్లాడుతున్న శ్రీరామ రామాంజనేయులు

మదనపల్లె, మార్చి 16: మదనపల్లె జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఎం.షాజహాన్ బాషాను గెలిపిద్దామని జనసేన నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆపార్టీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనితతో కలసి నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులతో సమీక్ష నిర్వహించారు. పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు ఉమ్మడి అభ్యర్థిని గెలిపించి..ఆపార్టీల అధినేతలకు కానుకగా ఇద్దామని సూచించారు. పొత్తుధర్మంలో భాగంగా తమ విజయానికి కృషి చేయాలన్న షాజహాన్‌బాషా వినతి మేరకు..శ్రీరామ రామాంజనేయులు అంగీకరించారు. ఈ సమావేశంలో జనసేన నేతలు దారం హరిప్రసాద్, పట్టణ అధ్యక్షుడు నాయని జగదీష్, కోటకొండ చంద్రశేఖర్, కుప్పాల శంకర్, అశ్వత్, ధరణి, యాసిన్, గణేష్, సోను, హర్ష, అశోక్, కిరణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనాథ్, గురు, గంగాధర్, శ్రీనివాసులు, సిద్దయ్య, రమేష్, మల్లికా, రూప, వెంకటేష్ పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు ఇవే చివరి రోజులు



తంబళ్లపలిల్లో సంబరాలు జరుపుకొంటున్న టీడీపీ నాయకులు

తంబళ్లపల్లి మార్చి 16: తంబళ్లపల్లిలో వైసీపీ అరాచక పాలనకు ఇవే చివరి రోజులని రాబోయో ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధిస్తుందని పార్టీ రాష్ట కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి పేర్కొన్నారు. శనివారం సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో స్థానిక నాయకులతో కలసి క్రాస్‌రోడ్డులో బాణా సంచా పేల్చి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తంబళ్లపల్లి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి జయచంద్రరెడ్డికి గతంలో ఎన్నడూ లేనివిధంగా ఘనసీయమైన మెజారిటీ రావడం ఖాయమన్నారు. వైసీపీ దౌర్జన్యం, అరాచకపాలనకు ప్రజలు చమరగీతం పాడుతారన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ఆదివారం నుంచి ప్రచారాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ వచ్చింది..రావణాసుర రాజ్యం అంతమే

- తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి



ములకలచెరువులో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మార్చి 16: సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో ఇక రాష్ట్రంలో రావణాసుర రాజ్యం అంతం కాబోతోందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరి పల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక బస్టాండు సర్కిల్‌లో శనివారం ఎన్నికల కోడ్ నోటిఫికేషన్ వచ్చిన సందర్భంగా జగన్ ప్రభుత్వానికి ఇదే చివరి రోజని భారీ ఎత్తున బాణా సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం ఘోరంగా ఓడిపోవడం ఖాయమన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, నాయీబ్రాహ్మణ విభాగం జిల్లా అధ్యక్షుడు కేశవులు, నాయకులు శివన్న, రంగాళ్ళ శ్రీనివాసులు, ప్రతాప్, నాగేంద్ర, ప్రతాప్‌నాయుడు, జహీర్, సోము, రామాంజులు, ఉమా, రమణారెడ్డి, చాంద్‌బాషా, రామయ్య, బసప్పా, ఇమాంబాషా తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ నేతల మద్దతు కోరిన జయచంద్రారెడ్డి

బికొత్తకోట, మార్చి16: తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసిరిపల్లె జయచంద్రారెడ్డి శనివారం బి. కొత్తకోట పట్టణంలో పర్యటించి పలువురు ముస్లిం మైనారిటీ నాయకుల మద్దతు కోరారు. రానున్న ఎన్నికలలో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేయనున్న తనకు మద్దతు ఇవ్వాల్సిందిగా వారి నివాసాలకు వెళ్లి అభ్యర్థించారు. ముస్లింల సంక్షేమం కోసం చంద్రబాబు తీసుకోనున్న నిర్ణయాలు, తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తాను చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరించారు. సీనియర్ టీడీపీ నాయకులు నాసర్, బుక్కపట్నం మోదీన్‌బాషా, మన్సూర్ అహ్మద్, సాదిక్ బాషా, ఉస్మాన్‌బేగ్, సయ్యద్‌బాషా, అబ్బాస్‌ఖాన్ తదితర నాయకులను ఆయన కలిశారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, మండల పార్టీ కన్వీనర్ నారాయణస్వామి రెడ్డి, నాయకులు కిట్టన్న, రవికుమార్, గంజిమోహన, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనకు నాంది పలుకుదాం

కలకడ, మార్చి 16:రాష్ట్రంలో ప్రజాపాలనకు నాంది పలకడానికి ప్రతి ఒక్కరు పని చేయాలని టీడీపీ మైనారిటీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని కోన, కలకడ పంచాయతీలో శనివారం శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి టీడీపీ పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు, కార్యకర్తలు కష్టపడి పార్టీ గెలుపునకు పని చేయాలని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బరకం శ్రీనివాసులరెడ్డి, కాంతారావు, చంద్రమోహన్, త్యాగరాజు, రాజకుమార్, గురుస్వామి, జిలానీ, ఇర్ఫాన్, ముబారక్‌అలీ, కరీముల్లా, జాఫర్, రఫీలు పాల్గొన్నారు.